విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

బుధవారం 24 సెప్టెంబరు 2025 8 పేజీలు

శ్రీ గాయత్రీదేవి అవతారంలో దుర్గమ్మ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు గాయిత్రీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ భక్తులు దర్శించుకున్నారు. గాయత్రీదేవి అలంకరణలో ఉన్న దుర్గమ్మను దర్శించుకునేందుకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. తెల్లవారుజామున నుంచే దుర్గమ్మ దర్శనం కోసం భక్తులు తరలివచ్చారు. కెనాల్ రోడ్డులోని వినాయగుడి వద్ద నుండి క్యూలైన్లలో బారులు తీరారు. జై దుర్గా జై దుర్గా అన్న నామస్మరణతో ఇంద్రకీలాద్రి మారుమోగుతోంది. భక్తి శ్రద్ధలతో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. సాయంత్రం సమయానికి సుమారు 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. 20 వేల మంది భక్తులు అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షిస్తున్నారు.

విజయవాడ ఉత్సవ్‌కు గవర్నర్ నజీర్

ఘన స్వాగతం పలికిన ఎంపీ కేశినేని శివనాథ్

విశాలాంధ్ర-విజయవాడ: విజయవాడ ఉత్సవ్ రెండవ రోజు మంగళవారం ముఖ్యఅతిథిగా గవర్నర్ జనాబ్ ఎస్. అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. ఉత్సవ్ వేదిక వద్ద గవర్నర్‌ను ఎంపీ కేశినేని శివనాథ్ ఘన స్వాగతం పలికారు. సరిగమ విజేత వాగ్దేవి గానామృతం, విజయవాడకు చెందిన తన్మయి బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలను గవర్నర్ తిలకించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ, విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, కాగిత కృష్ణ ప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

నేటి అలంకారం శ్రీ అన్నపూర్ణాదేవి



విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): శరన్నవరాత్రి ఉత్సవాల్లో శ్రీ కనకదుర్గమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిస్తారు. శ్రీఅన్నపూర్ణాదేవి అన్నమును ప్రసాదించే మాతృమూర్తి. అన్నం పరబ్రహ్మ స్వరూం. అన్నం సర్వజీవనాధారం, అన్నం లేనిదే జీవులకు మనుగడలేదు. శ్రీఅన్నపూర్ణాదేవి ఎడమచేతిలో ఉన్న బంగారు పాత్రలో ఉన్న అమృతాన్నము. వజ్రాలు పొదిగినా గరిటెతో సాక్షాత్తుగా ఈశ్వరునికే భిక్షను అందించే ఘట్టము అద్భుతము. ఆమె దర్శనము సర్వపుణ్య ప్రదాయకము. లోకంలో జీవుల ఆకలిని తీర్చటం కన్నా మిన్న ఏది లేదు. నిత్యాన్నదానేశ్వరి అలంకారంలో శ్రీదుర్గమ్మని దర్శించి తరించడంతో అన్నాధులకు లోపం లేకుండా, ఇతరులకు అన్నదానం చేసే సౌభాగ్యాన్ని పొందగలుతారు.

నిరుద్యోగ సమస్యలపై చర్చించాలి

నిరుద్యోగుల హామీలు అమలు చేయాలి ... కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐఎస్ఎఫ్ వినూత్న నిరసన

గుంటూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం, నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ సమస్యపై చర్చించాలని, ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి అమలు చేయాలని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ ఏఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద వినూత్నంగా ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వలి మీడియాతో మాట్లాడారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం తమ మాటల గారడితో యువకులను, నిరుద్యోగులను మోసం చేస్తున్నారని అన్నారు. అమరావతి రాజధాని ప్రాంతాన్ని ఫ్రీ జోన్‌గా ప్రకటించాలని, పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగులకు 70 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ శ్రీను, మరియదాసు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యస్వంత్, నగర కార్యదర్శి బన్నీ, సాయి, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు గోపి, నవీన్, రెహ్మాన్, ఖాదర్‌వలి పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: విద్యాశాఖ మంత్రి లోకేష్ ఎన్నికలకు ముందు పాదయాత్రలో భాగంగా జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి విడుదల చేస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు కే మల్లికార్జున్ -మిగతా 2 లో ...

డి.రాజాతో సీపీఐ నేతలు

విశాలాంధ్ర-విజయవాడ: భారత కమ్యూనిస్టు పార్టీ 25వ జాతీయ మహాసభలు చండీఘర్‌లో ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పార్టీ అమరవీరుల స్మారక స్థూపం వద్ద సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజాతో ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, కృష్ణాజిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, డాక్లర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్‌లు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా-7లో...

పిల్లలు, దివ్యాంగులకు తప్పని ఇక్కట్లు

క్యూలైనులో సొమ్మసిల్లి పడిపోయిన బాలిక

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): దసరా ఉత్సవాల్లో పిల్లలు, దివ్యాంగులకు ఇక్కట్లు తప్పట్లేదు. వృద్ధులు, దివ్యాంగుల -మిగతా 2 లో ...

నాణ్యతా ప్రమాణాలతో లడ్డూ ప్రసాదం

11 రోజులకు 36 లక్షల లడ్డూలు

మూలా నక్షత్రం, విజయదశమి రోజున ఉచిత లడ్డు ప్రసాదం పంపిణీ : కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విశాలాంధ్ర-విజయవాడ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి ఉన్న ప్రత్యేకతలలో లడ్డు ప్రసాదం అత్యంత నాణ్యత ప్రమాణాలతో తయారు అవుతోందని కలెక్టర్ జి లక్ష్మీశ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా లడ్డు ప్రసాద తయారీ కేంద్రాలను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొత్తంగా నవరాత్రి ఉత్సవాలకు 36 లక్షల లడ్డూలు అవసరమవుతాయని భావించి ఆ మేరకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఎక్కువ అవసరమైతే తయారు చేసేందుకు ఎలాంటి ఇబ్బంది లేదని పేర్కొన్నారు. మూలా నక్షత్రం సందర్భంగా భక్తుల సంఖ్య అసాధారణ స్థాయిలో ఉంటుందన్నారు. అదే సమయంలో లడ్డు ప్రసాదానికి కూడా డిమాండ్ పెరుగుతుందని, దీన్ని దృష్టిలో లడ్డూలను ఇప్పటికే సిద్ధంగా ఉంచామన్నారు. భక్తులకు ఆరోజు ఉచిత లడ్డు ప్రసాదం కూడా అందించడం జరుగుతుందన్నారు. రోజువారి రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రసాద విక్రయ కేంద్రాలను అప్పటికప్పుడు పెంచేందుకు దేవస్థానం సిబ్బంది సిద్ధంగా ఉన్నారని వివరించారు. ఇప్పటికే కనకదుర్గ నగర్ తో పాటు రైల్వే స్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో కూడా ప్రసాద విక్రయ కేంద్రాలు ఉన్నాయని, భక్తులు ఆయా కేంద్రాల్లో కూడా కొనుగోలు చేయవచ్చని -మిగతా 2 లో ...

కృష్ణానదికి వరద ఉధృతి

మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

విశాలాంధ్ర-తాడేపల్లి: ప్రకాశం బ్యారేజ్ వద్ద కృష్ణానది వరద ఉధృతి మంగళవారం కొనసాగింది. దీంతో బ్యారేజ్ అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నాగార్జునసాగర్, శ్రీశైలం నుండి నీరు విడుదల కావడంతో, రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలతో ఎగువ నుండి కృష్ణా నదికి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతుంది. మంగళవారం సాయంత్రానికి 4 లక్షల11 వేల క్యూసెక్కుల నీరు బ్యారేజీ వద్దకు వచ్చి చేరుతుంది. బ్యారేజీ కొన్ని 70 గేట్లు ఎత్తి దిగువకు సముద్రంలోకి -మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

నిరుద్యోగ సమస్యపై చర్చించాలి

అన్నారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిరుద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మల్లికార్జున్ మాట్లాడుతూ అధికారం వచ్చిన 100 రోజుల్లో 107-108 జీవో రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక మోసం చేశారని మండిపడ్డారు. మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణకు ఇవ్వడం దారుణమని, వెంటనే అ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర శాతంగా ఖాళీగా ఉన్నటువంటి అన్ని శాఖల్లో పోస్టులు భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవ్వాలని తీర్మానం చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమలు నెలకొల్ప నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నోటిఫికేషన్ విడుదల చేసి ఖాళీగా ఉన్న అన్ని శాఖల్లో పోస్టులు భర్తీ చేయాలని అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాలయాల్లో ప్రొఫెసర్ లెక్చరర్ టీచింగ్ నాన్ టీచింగ్, లైబ్రరీలలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, ఎస్సీ ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులను అన్ని విభాగాల్లో భర్తీ చేయాలని, వాలంటరీ వ్యవస్థను కొనసాగించాలని వాలంటీర్లలో విద్యార్హత ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో భర్తీకి అవకాశం కల్పించాలని, పేద నిరుద్యోగ యువతకు ఉచిత స్టడీ సర్కిలను అందుబా టులోకి తెచ్చి ఉచితంగా మెటీరియల్స్ పంపిణీ చేసి వారి భవిష్యత్తు గురించి ప్రభుత్వం ఆలోచన చేయాలని, ఈ డిమాండ్ల అన్నింటి పైన ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశంలో చర్చించి తీర్మానాలు చేసి రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ సమస్యలకు పరిష్కారం చూపించాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు లక్ష్మీపతి, వెంకటేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు, దివ్యాంగులకు తప్పని ఇక్కట్లు

కోసం ప్రత్యేక బస్సు ఆలయ అధికారులు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశారు. ఓంకార్ టర్నింగ్ పాయింట్ వద్ద బస్సు దిగిన తరువాత దివ్యాంగులు సమయానికి ఎలక్ట్రికల్ వాహనం లేక అక్కడి నుంచి గుడిలోకి వెళ్లాల్సిన పరిస్థితి. క్యూలైన్‌లో బారులు ఓ బాలిక సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో బంధువులు వెంటనే అక్కడే ఉన్న వైద్య శిబిరానికి తరలించారు.

కృష్ణానదికి వరద ఉధృతి

నీటిని విడుదల చేస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్, రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు లు తెలిపారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 4.11 లక్షల క్యూసెక్కులు కృష్ణానది పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి పొంగిపొర్లే వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయరాదని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలతో లడ్డూ ప్రసాదం

పేర్కొన్నారు. ప్రసాదం తయారీకి వినియోగిస్తున్న ముడి సరుకుల నాణ్యత కూడా పరిశీలించారు. లడ్డూలు ఎక్కువ కాలం నిలువ ఉండేలా అత్యంత నాణ్యత కలిగిన శనగపిండి, పంచదార, నూనె, నెయ్యి, జీడిపప్పు, కిస్మిస్, యాలకుల పొడి వాడుతున్నట్లుగా గమనించారు. అత్యంత పరిశుభ్ర వాతావరణంలో ఈ లడ్డు ప్రసాదం తయారు అవుతోందని వివరించారు. లడ్డు తయారీ కేంద్రాల నుంచి ఇతర ప్రాంతాల లడ్డు విక్రయ కేంద్రాలకు రవాణా చేసే సమయంలో రవాణా వాహనాలకు ఎదురవుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను చక్క దిద్దాలని పోలీస్ శాఖను ఆదేశించారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో దేవస్థానం ప్రసాదం కేంద్రం సహాయక అధికారి ఎం ఎస్ ఎల్ శ్రీనివాస్, పర్యవేక్షణ అధికారి శ్రీనివాసరావు కలెక్టర్ వెంట ఉన్నారు.

రియల్ టైం ఫీడ్బ్యాక్ ఆధారంగా సేవలు...

రియల్ టైం ఫీడ్ బ్యాక్ ఆధారంగా భక్తులకు సేవలు అందిస్తున్నట్లు జికలెక్టర్ లక్ష్మీశ ఇంద్రకీలాద్రి మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ తెలిపారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ చేసిన ఏర్పాట్లు సత్ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణీలు, బాలింతలకు ప్రత్యేక రవాణా సదుపాయం కల్పించామని తెలిపారు.

అమ్మవారి సేవలో మహిళ మంత్రులు, ఎమ్మెల్యేలు

గాయత్రీ దేవి అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారిని రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, ఎస్. సవిత, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, బండారు శ్రావణి శ్రీ, గల్లా మాధవి, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ మంగళవారం దర్శించుకున్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు వారు తెలిపారు. మంత్రులు, శాసనసభ్యులకు వేద పండితులు వేదాశీర్వచనం చేయగా, ఆలయ ఈవో సీనా నాయక్ అమ్మవారి చిత్రపటం,తీర్థప్రసాదాలు అందజేశారు.

స్కూల్ బస్సు డ్రైవర్‌కు గుండెపోటు

సకాలంలో స్పందించిన ట్రాఫిక్ పోలీసులు .. సీపీఆర్ చేసి ఆస్పత్రికి తరలింపు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): ప్రయాణిస్తున్న స్కూల్ బస్సు డ్రైవర్‌కు గుండెపోటు వచ్చింది. స్టీరింగ్ పై డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. ఎదురుగా వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టి ఆపై డీవైడర్‌ను ఢీకొట్టి బస్సు ఆగింది. ఆ బస్సులో సుమారు 32 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఘటన మంగళవారం విజయవాడ రామరప్పాడులో జరిగింది. నగరానికి చెందిన ఎస్ఆర్ ఎడ్యుకేషన్ ట్రస్టు స్కూల్ నిర్వహిస్తుంది. ఉదయం స్కూల్ విద్యార్థులను ఎక్కించుకుని తీసుకెళ్తున్న సమయంలో రామవరప్పాడు వద్ద డ్రైవర్‌కు గుండెపోటు వచ్చింది. ఎదురుగా వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. వాహనాదారుడికి తీవ్రగాయాలైయ్యాయి. వెంటనే స్పందించిన ట్రాఫిక్ సీఐ రమేష్, సిబ్బంది డ్రైవర్‌కు సీపీఆర్ చేసి ఆస్పత్రికి తరలించారు. గాయాపడిన బాధితుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.ఆ ఘటన సమయంలో స్కూల్ బస్సులో 32 మంది ఉన్నారు. వారంత సురక్షితంగా బయటపడ్డారు. మొత్తానికి విజయవాడలో పెనుప్రమాదం తప్పింది. స్కూల్ బస్సు ప్రమాదానికి గురైన విషయం తెలియగానే విద్యార్థుల తల్లిదండ్రులు హడలిపోయారు. వెంటనే స్కూల్ ఫోన్లు చేయడం మొదలుపెట్టారు. మరోవైపు స్కూల్ యాజమాన్యం డ్రైవర్‌కు గుండెపోటు వచ్చిన విషయం తెలియగానే ఆసుపత్రికి చేరుకున్నారు. విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. దీంతో స్కూల్ యాజమాన్యం ఊపిరిపిల్చుకున్నారు.

శ్రీ బాలా త్రిపుర సుందరిదేవి అలంకారంతో దర్శనమిచ్చిన చిట్టినగర్ శ్రీ మహాలక్ష్మిఅమ్మవారు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): దసరా ఉత్సవాల సందర్భంగా మంగళవారం చిట్టి నగర్ లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ప్రారంభమైన రెండో రోజున ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానాన్ని, అలాగే శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించడంతో సూపర్ లకు ఈ రెండు దేవాలయాలు కనువిందు చేస్తున్నాయి. ఈ సందర్భంగా శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం కమిటీ కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళాశ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ దసరా సందర్భంగా రెండో రోజున సైతం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడం జరిగిందన్నారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకొని దేవస్థానంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశామని వివరించారు. శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దసరా మహోత్సవాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని వారు చెప్పారు. ప్రతినిత్యం పెద్ద సంఖ్యలో విచ్చేసే భక్తులను దృష్టిలో పెట్టుకొని తదనగుణంగా ఏర్పాటు చేశామని వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రతినిత్యం వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుంటున్నారని చెప్పారు. కాగా ఉత్సవాల ఏర్పాట్లలో పలువురు కమిటీ గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ, సహాయం జాయింట్ సెక్రెటరీ సీరం వెంకట్రావు, కమిటీ సభ్యులు కామందుల నరసింహారావు, మజ్జి శ్రీనివాసరావు, మజ్జి ఈశ్వరరావు, పోతిన ధర్మారావు, పోతిన సాంబశివరావు ,బంక హనుమంత రావు, పిళ్ళా విజయ్ తదితరులు పాల్గొని భక్తులకు అవసరమైన సదుపాయాలను పర్యవేక్షించారు. కాగా దేవస్థానం ప్రాంగణంలో ప్రతినిత్యం సాయంత్రం పూట జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి.

టూవీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



విశాలాంధ్ర - గుడివాడ : గుడివాడ టూ వీలర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక సోమవారం రాత్రి జరిగినట్లు నూతన అధ్యక్షుడు చెరుకూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కిన్నెర కాంప్లెక్స్‌లో ది గుడివాడ టూవీలర్ మెకానిక్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా చెరుకూరి శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడిగా అన్సారి, కార్యదర్శిగా వి.సింహాచలం, కోశాధికారిగా పినపాల మధులను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీనివాసరావును అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కొండపల్లి మధుబాబు, రవి, శ్రీను, తదితరులు, పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న తెలంగాణ ఎంపీ రఘునందన్ రావు

-దర్శన ఏర్పాట్లపై కలెక్టర్‌కు ప్రశంసలు..

విశాలాంధ్ర-విజయవాడ: దసరా శరన్నవరాత్రుల్లో రెండవ రోజు మంగళవారం శ్రీ గాయత్రి మాతను తెలంగాణ రాష్ట్ర మెదక్ లోక్ సభ సభ్యులు రఘునందన్ రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయన్నారు. జిల్లా కలెక్టర్ కు అభినందనలు తెలియజేశారు. వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) రేటును తగ్గించడం వల్ల పండుగ ఆనందం రెట్టింపు అయిందన్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా దేశ ప్రజలకు లబ్ది చేకూరుతుందని చెప్పారు. జీఎస్టీ కోసం ప్రధాని నరేంద్ర మోదీ విశేష కృషి చేశారని, అమ్మవారి ఆశీస్సుల తో ప్రధాని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

గాయత్రీదేవిగా అమ్మవారు

విశాలాంధ్ర-కంచికచర్ల : కంచికచర్ల పట్టణంలో వివిధ ప్రాంతాల్లోని మండపాలలో ఏర్పాటు చేసిన అమ్మవారు రెండవరోజు పూజలు అందుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ప్రతి రోజూ అమ్మ వారికి విశేష పూజలు కుంకుమార్చనలు లలిత సహస్రనామం పారాయణ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని, భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కమిటీ వారు తెలిపారు. కంచికచర్ల పట్టణంలో పలు ప్రదేశాల్లో రెండవ రోజు అమ్మ వారి మండపాలలో వివిధ అలంకరణతో కంచికచర్ల పట్టణంలో పోలీసు స్టేషన్ లో, పశువుల హాస్పిటల్ బజార్ వాటర్ ప్లాంట్ వద్ద గాయత్రి దేవిగా, ,వసంత కాలనీల్లో కమ్యునిటి హాల్ వద్ద స్వర్ణ కవిచాకృతా దేవిగా,మెదర బజార్ లో, ఫైర్ స్టేషన్ బజారులో కన్యకాపరమేశ్వరి దేవాలయంలో గాయిత్రి దేవిగా, శివసాయి క్షేత్రం లో గాయత్రి దేవిగా,పాత శివాలయంలో గాయత్రి దేవిగా, మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రీ శైల పుత్రి దేవిగా,, గొట్టుముక్కల గ్రామంలో వివిధ ప్రదేశాల్లో దశర నవరాత్రుల్లో భాగంగా అమ్మ వారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు అర్చనలు,లలిత పారాయణం గోత్రనామాలు తో పూజలు నిర్వహిస్తున్నామని అమ్మ వారి దశర నవరాత్రులు కమిటీ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాల ఏర్పాటు

విశాలాంధ్ర, విస్సన్నపేట : విస్సన్నపేట మండలం పుట్రేల, విస్సన్నపేట గ్రామాల్లో మంగళవారం వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యం లో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వశక్తి పరివార్ అభయాన్ కార్యక్రమంలో ఈ శిబిరాలు ఏర్పాటు చేసినట్లు మండల వైద్యాధికారి డా.కె.శ్రీనివాసరావు తెలిపారు. పుట్రేల గ్రామంలోని సచివాలయ ప్రాంగణంలో, విస్సన్నపేటలోని బీసీ కాలనీలో రోగులకు పరీక్షలు చేసి, మందులు అందజేశారు.

CHANGE OF NAME

I,Adapaka Mounika (Old Name) W/o Gurrana Durga Rao, R/o D.No.1-150, Srinagar Colony, Gannavaram Village and Mandal, Krishna District Pin:521101, AP (Aadhar card No:9263 0366 4834). I have changed my name as **Gurrana Mounika Sri** (New Name). My personal surname is Adapaka. After my marriage my surname cahnged as Gurrana instead of Adapaka. Here after my name is known as **Gurrana Mounika Sri** (New Name) W/o Gurrana Durga Rao.

సాంకేతికతతో ఫోన్ రికవరీ

విశాలాంధ్ర-గంపలగూడెం : గంపలగూడెం మండలం, తునికిపాడు గ్రామానికి చెందిన దారెల్లి జగదీశ్ బైక్‌పై గంపలగూడెం వెళ్తుండగా మార్గమధ్యంలో తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నారు. ఫిర్యాదు మేరకు గంపలగూడెం పోలీ సులు సాంకేతిక సహాయాన్ని వినియోగించి ఆ మొబైల్ ఫోన్‌ను గుర్తించి తిరిగి అందజేశారు.

కోసూరులో పేకాట రాయుళ్ల అరస్టు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంకోసూరు పొలాల్లో మంగళ వారం మధ్యాహ్నండబ్బులుఫణం గా పెట్టి కోత ముక్క అను పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.2,300 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కేవన్ విశ్వనాథ్ తెలిపారు

నరసింహారావుపాలెంలో దేవీ నవరాత్రులకు అంగీకారం

నద్దు మణిగిన వివాదం

విశాలాంధ్ర -వీరులపాడు: మండలంలోని నరసింహారావుపాలెంలో దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం బతుకమ్మల ఏర్పాటులో ఇరువర్గాల మధ్య ఏర్పడిన వివాదం పోలీస్, రెవెన్యూ, ఆర్ఎస్ఎస్, హిందు సంఘాల ఆధ్వర్యంలో ఇరు వర్గాలతో జరిపిన చర్చలతో సద్దుమణిగింది. వివరాలలోకి వెళితే దసరా పండుగను పురస్కరించుకొని అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలు జరుపుటకు గ్రామంలోని రెండు వర్గాలు ఏర్పాటు చేసుకున్నాయి. అయితే గ్రామానికి మధ్యలో ఇరు వర్గాల వారు ఒకే దేవస్థానం వద్ద బతుకమ్మలను ఉంచి కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఏర్పాటు చేసుకున్నారు. ఇదే క్రమంలో ఓ వర్గానికి చెందిన వారు ప్రత్యర్థి వర్గం వారు ఏర్పాటు చేయదలచిన అమ్మవారి విగ్రహాన్ని తమ ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు నిరాకరించడంతో వివాదం మొదలైంది. దీంతో 36 గంటలుగా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూజించేందుకు తీసుకువచ్చిన అమ్మవారి విగ్రహాన్ని ఆటోలోనే నడిరోడ్డుపై ఉంచి, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నడిరోడ్డు పైనే బతుకమ్మలు ఆటుతూ నిరసనకు దిగారు.గతంలో కూడా ఇరు వర్గాలకు రాజకీయ వైశ్యామ్యాలు ఉండటంతో రాజకీయ రంగు పులుముకుంది. సోమవారం ఒకరిపై ఒకరు వ్యక్తిగత దూషణలకు దిగారు. దీంతో నందిగామ ఏసీపి ఆధ్వర్యంలో గ్రామంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నందిగామ సబ్ డివిజనల్ అసిస్టెంట్ కమిషనర్ పీబీజీ తిలక్, రూరల్ సీఐ చవాన్, వీరులపాడు ఎస్సై జి అనిల్, ఎస్సై ధర్మరాజు, స్థానిక తహసీల్దార్ రవికుమార్, ఆర్ఎస్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి నితీష్, కృష్ణారెడ్డి లు ఇరు వర్గాలతో పలు జపాలుగా చర్చలు జరిపి సామ రస్య పూర్వకంగా గ్రామ సెంటర్లోనే వేరువేరు ప్రదేశాలలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకొని బతుకమ్మలు ఆడుకునేందుకు అంగీకరింపజేశారు.

ఎంపీడీవోగా టి. సరస్వతి పదవి బాధ్యతలు



విశాలాంధ్ర-గంపలగూడెం : గంపలగూడెం మండల నూతన మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా మంగళవారం సాయంత్రం పదవి బాధ్యతలు స్వీకరించిన టి. సరస్వతి. ఇప్పటివరకు ఏ.కొండూరు మండల డిప్యూటీ ఎంపిడిఓ గా విధులు నిర్వహించి పదోన్నతి పై గంపలగూడెం నందు ఎంపిడిఓ గా బాధ్యతలు స్వీకరించారు. మండల అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఎంపీడీవో టీ.సరస్వతి తెలిపారు.

గాయత్రీదేవిగా పూజలందుకున్న కనకదుర్గమ్మ



విశాలాంధ్ర, విస్సన్నపేట : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విస్సన్నపేటలోని పలు ప్రాంతాల్లో దుర్గాదేవిని భక్తులు మంగళవారం గాయత్రీదేవిగా అలంకరించి, పూజించారు. కనకదుర్గ దేవాలయం, పుట్రేల మారెమ్మ దేవాలయంతోపాటు విస్సన్నపేట గ్రామంలోని పలు కూడళ్లు, పలు గ్రామ కూడళ్లలో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

‘విజయవాడ ఉత్సవ్’లో భాగస్వాములు కావాలి

-నేడు ఉప రాష్ట్రపతి సీకే రాధకృష్ణన్ రాక

విశాలాంధ్ర-విజయవాడ: విజయవాడ ఉత్సవ్‌లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని, వేదికలపై జరుగుతున్న పలు కార్యక్రమాలను భక్తులతోపాటు నగరవాసులు ఆస్వాదించి విజయవంతం చేయాలని ఎంపీ కేశినేని శివనాథ్ పిలుపునిచ్చారు. ఉత్సవ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను మంగళ వారం పరిశీలించి అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఈ ఉత్సవం ఘనంగా ప్రారంభించుకోవడం జరిగిందని, ఈ ఉత్సవాలకు 24వ తేదీన భారత రాష్ట్రపతి సీకే రాధకృష్ణన్ రానున్నారని తెలిపారు. 28న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, 29న కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పాల్గొంటారని తెలిపారు. స్వచ్ఛంద కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి మాట్లాడుతూ దసరా ఉత్సవాల సందర్భంగా నగర ప్రముఖులందరూ ఒక సొసైటీగా ఏర్పడి నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు విజయవాడకు మరింత శోభ తీసుకొచ్చాయన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ కళాబృందాలు, సంగీత విధ్వంసులను, కళాకారులను ఆహ్వానించామని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న వెంకన్న మాట్లాడుతూ భవిష్యత్ తరాలు చర్చించుకునేలా విజయవాడ ఉత్సవ్ కు స్వీకారం చుట్టి, అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న ఘనత ఎంపీ కేశినేని శివనాథ్ కే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా, నగరాల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తిరుమలేష్, నగరాల కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ సుఖాసి కిరణ్, గొల్లపూడి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాల మాధవ, తదితర నాయకులు పాల్గొన్నారు.

2వ రోజు అమ్మవారి అలంకారాలు

శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో, చిన శివాలయంలో గాయత్రిదేవి అలంకారంలో, వేణుగోపాలస్వామి దేవస్థానంలో సంతనలక్ష్మీదేవిగా, శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీధాన్యలక్ష్మీదేవిగా..

విశాలాంధ్ర-గుడివాడ : విజయదశమిని పురస్కరించుకుని దేవి శరన్నవరాత్ర మహోత్సవాల 2వ రోజు మంగళవారం అమ్మవారి దేవాలయాలు భక్తులతో కళకళలాడుతున్నాయి.

శ్రీభీమేశ్వరస్వామి వారి దేవస్థానంలో...

స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని శ్రీ భీమేశ్వరస్వామివారి దేవస్థానములో జరుగుతున్న శ్రీ దేవి శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అవతారంలో దర్శినమిచ్చారు. ఉత్సవ కమిటి చైర్మన్ పట్టపు చిన్న, కమిటి సభ్యులు, కార్యనిర్వహణాధికారి గోపాలరావుల నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

శ్రీగౌరీశంకరస్వామి వారి దేవస్థానంలో...

స్థానిక గౌరీశంకరపురంలో వేంచేసియున్న శ్రీ గౌరీశంకర స్వామి వారి దేవస్థానము నందు శ్రీ దేవి శరన్నవరాత్ర మహెూత్సవములలో భాగంగా మంగళవారం శ్రీగాయత్రిదేవిగా భక్తులకు దర్శినమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానము కమిటి చైర్మన్ నెరుసు బోసు, ఇఓ కందుల వెణుగోపాలరావు, పట్టణ ప్రముఖులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీవేణుగోపాలస్వామి వారి దేవస్థానములో...

గుడివాడలోని శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానములో శ్రీ దేవి శరన్నవరాత్ర మహెూత్సవలల్లో భాగంగా సంతనలక్ష్మి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మ వార్కి విశేషపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటి చైర్మన్ అంగడాల సతీష్, కమిటి సభ్యులు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కెవి గోపాలరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానములో...

గుడివాడలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వరస్వామివారి దేవస్థానములో శ్రీ దేవి శరన్నవరాత్ర మహెూత్సవలల్లో భాగంగా ధాన్యలక్ష్మిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మ వార్కి విశేషపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు లింగం చిట్టిబాబు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కెవి గోపాలరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాల శిక్షణతో వ్యక్తిగత సామర్థ్యం బలోపేతం : జివిఎన్ రాజు

విశాలాంధ్ర-విజయవాడ: విద్యార్థులకు జీవన నైపుణ్యాల శిక్షణ ఇవ్వడం వలన ఆత్మ విశ్వాసం, వ్యక్తిగత సామర్థ్యం బలోపేతం అవుతోందని ప్రఖ్యాత జీవన నైపుణ్యాల శిక్షకుడు జి.వి.ఎన్.రాజు అన్నారు. హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ ట్రైనింగ్‌లో భారతదేశంలోని వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదిలోని విద్యార్థులకు జీవన నైపుణ్యాలను సమగ్రపరచడం. సామాజిక నైపుణ్యాలు, భావోద్వేగ నైపుణ్యం, అభిజ్ఞా నైపుణ్యాలపై ప్రధానంగా ప్రాధాన్యతలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. బోధన సమయంలో ఈ నైపుణ్యాలను వర్తింపజేయడం చాలా సవాలుతో కూడుకున్నదని, భవిష్యత్ పౌరులను నిర్మించడంలో బోధన పట్ల మక్కువ అవసరం అన్నారు. కొత్త విద్యా విధానం ప్రకారం బోధన సమయంలో అమలు చేయాల్సిన కొత్త పద్ధతులు, వ్యూహాలను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యమన్నారు.. ఈ కార్యక్రమాన్ని సమన్వయ ఫీల్డ్ ఆఫీసర్ సౌందర్య కౌశిక్ పర్యవేక్షించారు.

నిరంతర పర్యవేక్షణ

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు.. విస్తృతంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు

విశాలాంధ్ర-విజయవాడ: ఇంద్రకీలాద్రికి తరలివస్తున్న భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లును ఎప్పటికప్పుడు కలెక్టర్ జి లక్ష్మీశ పరిశీలిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి భక్తులను పలకిస్తూ ఏర్పాట్ల అభిప్రాయాలను తెలుసుంటున్నారు. రెండవ రోజు మంగళవారం మోడల్ గెస్ట్‌హౌస్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రం సందర్శించి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. సీసీటీవీ దృశ్యాలను వీక్షించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్షేత్రస్థాయి అధికారులకు పలు సూచనలు చేస్తున్నారు. అలాగే విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా వివిధ ప్రదేశాల్లో చెత్తను తొలగించి, బ్లిచింగ్ వినియోగించి పరిసరాలను ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేస్తున్నారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ,వీయంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఇతర అధికారులు ఉన్నారు.

సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్‌గా భార్గవ్‌తేజ్

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : సిఆర్‌డిఏ అడిషనల్ కమిషనర్ గా నూతన బాధ్యతలు స్వీకరించిన అమ్మిలినేని భార్గవ్‌తేజ్‌కు సొంగా రవీంద్ర ప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం అడిషనల్ కమీషనర్ సిఆర్‌డిఏలో బాధ్యతలు తీసుకున్న అమ్మిలీనేని భార్గవ్ తేజ్ (ఐ.ఏ.ఎస్) కార్యాలయంలో సొంగా రవీంద్ర ప్రసాద్, డిఐఒఎస్/ఏపి సిఆర్‌డిఏ,సిఆర్‌డిఏ యూనిట్ సర్వేయర్స్ యూనిట్ గౌరవ సూచకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియ చేశారు.

ప్రయాణికుడికి బ్యాగు అందజేత

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైలులో బ్యాగు మర్చిపోయి రైలు దిగిపోయిన ప్రయాణికురాలికి తిరిగి ఇచ్చిన ఘటన మంగళవారం విజయవాడలో చోటుచేసుకుంది. విజయవాడ ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ) సిఐ జె.వి రమణ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 19న మంజు అనే అమె రైలు నెం 12621 తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తు నీలం రంగు ట్రాలీ సుట్‌కేసు బ్యాగ్ ను మరిచిపోయి దిగి వెళ్ళిపోయింయంది. ఇంటికి వెళ్ళిన తరువాత గుర్తించి విజయవాడ జీఆర్పీ పోలీసులను ఫోన్ ద్వారా సంప్రదించి రైలు, బ్యాగు వివరాలు తెలియజేశారు. వెంటనే స్పందించిన సిబ్బంది విజయవాడలో రైలులో వెతికి బ్యాగును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ బ్యాగును తెరచి చూడగా అందులో రూ. 12 వేలు నగదు, దుస్తులు ఉన్నాయి. బాధితురాలకు సమాచారం అందించగా వారి బందువు అయిన మొగరాజపురానికి చెందిన కిషోర్ కుమార్‌ను పిలిపించి జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ జె.వి రమణ నగదును అప్పగించారు. సకాలంలో స్పందించి పొయిందనుకున్న నగదును అప్ప గించిన జీఆర్పీ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపాడు.

CHANGE OF NAME

I, **SATHYA SRI PADMAJA KUMARI (Old Name)** W/o. Venkata Ramana Rao Patri, resident of D.No. 13-52, Agraharam, Challapalli, Krishna, Pin: 521126, Andhra Pradesh, India. I have changed my name as **SATYA SRI PADMAJA KUMARI KOSURU (New Name) W/o. VENKATA RAMANA RAO PATRI.** Hereafter my name is known as **SATYA SRI PADMAJA KUMARI KOSURU (New Name). W/o. Venkata Ramana Rao Patri.**

డ్రోన్లతో దసరా ఉత్సవాల పర్యవేక్షణ

నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలకు డ్రోన్లతో పర్యవేక్షిస్తూ వీఎంసి కల్పిస్తున్న వసతుల్లో ఎలాంటి లోపం లేకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా కమిషనర్ మంగళవారం వినాయకుని గుడి, కెనాల్ రోడ్, సీతమ్మవారి పాదాలు ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దర్శనానికి వచ్చే యాత్రికులకు ఎలాంటి లోటు లేకుండా నగరపాలక సంస్థ అన్ని వసతులు పూర్తిస్థాయిలో కల్పించాలని ఆదేశించారు. యాత్రికులకు చెప్పుల స్టాండ్లు ఉన్నప్పటికీ రోడ్లపైన చెప్పులను వదిలేయటంపై అసహనం వ్యక్తం చేస్తూ మరిన్ని సౌకర్యాలను పెంచాలని, అవసరమైన చోట ఉచిత చెప్పుల, సామాన్లు భద్రపరిచే స్టాండ్ల సంఖ్య పెంచాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఎటువంటి లోపం లేకుండా నిరంతరం స్టాక్ పాయింట్ల నుండి తాగునీటి పాయింట్లకు సరఫరా చేసేలా అధికారులు పర్యవేక్షిస్తూండాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లతో, మోడల్ గెస్ట్ హౌస్‌లో వీఎంసి సిబ్బంది ఇతర శాఖలతో సమన్వయం చేసుకొని అమ్మవారి దర్శనంలో యాత్రికులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆయా శాఖల అధికారుల ఆదేశించారు.

సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

నగరపాలక సంస్థ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి 11 గంటలకు ఎంజీ రోడ్ ఈట్ స్ట్రీట్‌లో వ్యాపారులు, వినియోగదారులకు సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు.

దర్శనానికి వచ్చిన దివ్యాంగులకు, వృద్ధులకు "సేవాదళ్" బృందం చేయూత

విశాలాంధ్ర-విజయవాడ: దుర్గ అమ్మవారి దర్శనానికి వచ్చే దివ్యాంగులు, వృద్ధులకు పోలీసు సేవాదళ్ బృందాలు చక్కటి సేవలందిస్తున్నాయి. పదిమంది సభ్యులతో ఏర్పాటు చేసిన ఈ బృందాలు వేకువ జాము నుంచి రాత్రి దర్శనం పూర్తయ్యే వరకు దివ్యాంగులు, వృద్ధులు దర్శనం చేసుకోవడంలో సాయం చేస్తూ భక్తుల ప్రశంసలు పొందుతున్నాయి. పోలీస్ ఏఆర్ విభాగానికి చెందిన ముగ్గురు మహిళా సేవాదళ్ సభ్యులు తనకు ఏ ఇబ్బంది కలగకుండా చూసుకున్నారని, వారికి, పోలీస్ శాఖకు, దేవస్థానానికి, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

ప్రత్యేక బస్సులు ఏర్పాటు...

దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి దర్శనానికి వివిధ ప్రదేశాలు నుండి తరలివస్తున్న వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో వీకే నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు చేసిన బస్సులను పరిశీలించి తగు సూచనలు చేశారు.

ఏపీఐఐసీ భూములకు పరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఏపీఐఐసీ తమ భూములు దౌర్జన్యంగా లాక్కుందని, తమకు ఎటువంటి పరిహారమూ ఇవ్వలేదని కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామ రైతులు తమ అవేదనను వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మిగిలిన తమకు కుడా నష్టపరిహారం ఇచ్చి న్యాయం చేయలని డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో భూములు కోల్పోయిన మల్లవల్లి గ్రామ రైతులు దోనవల్లి వెంకట్రావు,వేముల నాగమ్మ,మాట్లాడుతూ మల్లవల్లి గ్రామ సర్వే నంబరు 11 లో మాకు 150 ఎకరాల భూమి ఉందన్నారు. గత 60, 70 సంవత్సరాలుగా తమ అధీనంలోనే ఉందని, భూములకు నిజాం పట్టాలు, దస్తావేజులు, శిస్తు రశీదులు ఉన్నాయన్నారు.2012 వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం మల్లవల్లి సర్వే నెం. 11లో గల 1406 ఎకరాలలో సుమారు 1200 ఎకరాల భూమిని ఇండస్ట్రియల్ పార్క్ నిమిత్తం సేకరించిందన్నారు. రెవెన్యూ శాఖ అధికారులు, ఏపీఐఐసీ అధికారులు తమకు ఎటువంటి నోటీసులు ఇవ్వలేదన్నారు. తమ భూములు తీసుకుంటున్నట్లు కనీసం సమాచారం కూడా ఇవ్వలేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో గన్నవరం నియోజకవర్గ టీడీపీ నాయకులు, అధికారులు పార్టీ వివక్షతో మా భూములను అన్యాయంగా చట్ట వ్యతిరేకంగా స్వాధీనపరుచుకున్నారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. భూమికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతులు దోనవల్లి వెంకట్రావు, శేఖర్, రామకృష్ణారావు, దోనేపూడి సోమేశ్వరరావు, పి ప్రసాద్, జి శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల నివారణకు సామూహిక చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర-మోపిదేవి : ఎలుకల నివారణకు సామూహిక చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సుధారాణి తెలిపారు. ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల శాస్త్రవేత్తల బృందం మోపిదేవి మండలం లోని మెరకనపల్లి గ్రామము నందు వివిధ పంటలలో ఎలుకల యాజమాన్యంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త డా. సుధా రాణి మాట్లాడుతూ ఎలుకలు అన్ని పంటలలో నష్టాన్ని కలుగచేస్తున్నాయని వీటి నివారణకు సామూహిక చర్యలు చేపట్టాలని బ్రమోడయాలోన్ విషపు ఎరను తయారు చేసుకుని పొలంలో పెట్టుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కేవికే సస్యరక్షణ శాస్త్రవేత్త డా. రేవతి, పిఎసిఎస్ చైర్ పర్సన్ యర్రం శెట్టి సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.

గ్రీన్ దసరాగా ప్లాస్టిక్ రహిత అమ్మవారు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : స్వచ్ఛోత్సవ్-స్వచ్ఛత హి సేవలో భాగంగా కేంద్ర, ప్రభుత్వ సూచనల మేరకు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు మంగళవారం నగరంలో వినూత్న రీతిలో గ్రీన్ దసరా వేడుకలు నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక మధురానగర్, ఫార్చ్యూన్ మురళి పార్క్, పున్నమిక గాట్ వద్ద నిర్వహించిన విజయవాడ ఉత్సవంలో ప్లాస్టిక్ రహిత అమ్మవారును అలంకరించారు. ఈ దసర సందర్భంగా నగరంలో గ్రీన్ దసరా వేడుకలను నిర్వహించిన నిర్వాహకులను కమిషనర్ అభినందించారు. నగర వ్యాప్తంగా ప్రజలు స్వచ్ఛోత్సవ్-స్వచ్ఛతా హి సేవలో భాగంగా ప్లాస్టిక్ రహిత అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

రోడ్డు మరమ్మతులు పనులు పరిశీలన

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం పెదముత్తేవిలో రూ.40 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్, మొవ్వ మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, సర్పంచ్ ఉప్పలపాటి నాగలక్ష్మి ప్రసన్న, స్థానిక తెలుగుదేశం నాయకుడు ఉప్పలపాటి కిరణ్ తదితరులతో కలిసి పరిశీలించారు. శ్రీ లక్ష్మీ పతిస్వామి వారి దేవాలయం వద్ద నుంచి అయినంపూడి డ్రైన్ వరకు 400 మీటర్ల నిడివి గల ఈ రహదారికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలు కేటాయించగా ఎంపీ వల్లభనేని బాలశౌరి ఎంపీ నిధుల నుంచి రూ.20 లక్షలు కేటాయించారు. పంచాయతీరాజ్ ఏఈ బి రామారావు ఆధ్వర్యంలో పెదముత్తేవి సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ అవినాష్ పనుల నిర్వహణను కొనసాగిస్తున్నారు.

బాలా త్రిపుర సుందరికి వెండి కళ్లు బహుకరణ

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడిలోని శ్రీగంగా బాలా త్రిపుర సుందరిసమేతశ్రీ రామలింగేశ్వర దేవస్థానంలోని శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారికి ఆలయ పాలకమండలి కమిటీ సభ్యులుభాగవతుల సీతారామారావు ఇందిర దంపతులు రెండు జతల వెండి కళ్ళను పాలకమండలి సభ్యులు పసుమర్తి నారాయణ మూర్తి ద్వారా అర్చకులు పెనుమూడి పూర్ణచంద్రశేఖర శర్మ పెనుమూడి సతీష్ కుమార్ శర్మలకు అందజేశారు.

నాట్యపుష్కరిణిలో పారిశుధ్య పనులు

విశాలాంధ్ర-కూచిపూడి : వారసత్వ సంపద గ్రామంగా ప్రభుత్వం తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా మొవ్వ మండలంకూచిపూడి లోని నాట్యపుష్కరిణి (వేదాంతం వారి ధర్మ చెరువు) సుందరీ కరణ కోసం ఎంపీడీవో దయాల సుహాసిని సూచనలతో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ అధికారుల పర్యవేక్షణలో కూలీలు పుష్కరణి మెట్లపై గల మొక్కలను, పుష్కరిణిచుట్టునాలుగు వైపుల గల పిచ్చి మొక్కలను, పరిశుభ్రత చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ కైలదుర్గారావు పనులు నిర్వహించుచుండగా, గ్రామ తెలుగుదేశం అధ్యక్షుడు వెంపటి గోపాలకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

పోషకాహారంపై శ్రద్ధ తీసుకోవాలి

విశాలాంధ్ర-పమిడిముక్కల: బాలింతలు గర్భిణులు పోషకాహారం పై శ్రద్ధ తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ అబ్దుల్ మున్నీస్సా తెలిపారు.చోరగుడి శివారు గోపాలకృష్ణాపురం(పిచ్చుకలపాడు) లో ఓకల్ ఫర్ లోకల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరంకిలాకు ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సైరా ఖాటూన్ వైద్య పరిక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంది మళ్ళ పూర్ణ కుమారి, కె.సుబ్రమణ్యేశ్వరరావు, ఎవివి వరలక్ష్మి కృష్ణ మోహన్, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మకు కాసుల హారం సమర్పణ

విశాలాంధ్ర -పమిడిముక్కల: హనుమంతపురం (గడ్డిపాడు)లోని శ్రీ ఆంజనేయ సీతారామస్వామి ఆలయం లోని సీతాదేవికి బంగారు కాసులు హారాన్ని స్థానికులు కీ,శే, కొల్లిపర వెంకటేశ్వర రావు భార్య కొల్లిపర సీతామహాలక్ష్మి సమర్పించారు.ఈ సందర్భంగా సదరు హారం 32.84 గ్రా, లని ఖరీదు రూ.3 లక్షలని నిత్యం సీతాదేవికి అలంకరించాలని అర్చకుడు పి.చక్రవర్తికి అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

101 మందికి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర, కూచిపూడి : స్వస్త్ నారీ -సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఉచిత వైద్య సేవలను మొవ్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం పరిధిలోని కూచిపూడి గ్రామ సచివాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 101 మందిని పరీక్షించి మందులు పంపిణీచేశారు నిడుమోలు పీ.హెచ్.సి వైద్య అధికారి డాక్టర్ విజయ్‌కుమార్ రోగులను పరీక్షించారు. పి.హెచ్ఎన్. దాసరి శ్రీలక్ష్మి,మొవ్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఏఎన్ఎంలు జి సమిత, కే బుజ్జి, శైలజ,విల్లీ రాణి, చంద్రమ్మ, రోజా తదితరులు, ఆరోగ్య కార్యకర్త కె రామాంజనేయులు, సచివాలయ సిహెచ్ఓలు స్వీటీ, దీపిక,యశ్విత, నీలిమ, దివ్య,కమలలతోపాటు ఆశా వర్కర్స్ సహకరించారు. సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఈ వైద్య సేవలను మహిళలు, పేద వర్గాలు సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరాలు 104 మొబైల్ వైద్యశాల జిల్లా మేనేజర్ జి సీతారామాంజనేయరాజు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ (ఓ.ఈ.) శ్రీనివాస్ పెరుమాళ్ళు పరిశీలించగా డీఈవో శివలీల సహకరించారు.

గాయత్రి దేవిగా బాలా త్రిపుర సుందరి దేవీ

విశాలాంధ్ర-కూచిపూడి : శరన్నవరాత్రి వేడుకలలో భాగంగా రెండో రోజైన మంగళవారం బాలా త్రిపుర సుందరి అమ్మవారు శ్రీ గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉభయ దాతలు అన్నభొట్లశ్రీనివాస్-రుద్రాణి (ముంబై) దంపతులు, వేదాంతం వెంకట నాగ ప్రసాద్- ప్రశాంతి (కూచిపూడి) దంపతులు, చింతా వెంకటరమణ -విజయలక్ష్మి (కూచిపూడి) దంపతులు నవ కుమారి పూజలు,సువాసిని పూజలు, శ్రీ లలితా పరమేశ్వరి సువాసిని పూజలు చేశ్రూరు. ఈసందర్భంగా పూర్ణ దీక్షాపరులుజోశ్యుల కార్తికేయ శర్మ ఆధ్వర్యంలో నవావరణ, శ్రీ చక్రార్చన, సహస్ర నామకుమార్చన పూజలు నిర్వహించారు.

చెరువు అభివృద్ధి పనులు ముమ్మరం

- రూ.3 కోట్ల సీఎస్ఆర్ నిధులు
- చుట్టూ ఫెన్సింగ్, కిడ్స్ ప్లే ఏరియా
- 1.6 కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్

విశాలాంధ్ర-మంగళగిరి : రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి స్థానికులకు ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని, వినోదాన్ని, విజ్ఞానాన్ని అందించే విధంగా తీర్చిదిద్దుతున్నారు. ఎంటీఎంసీ పరిధిలోని కాజ శివాలయం పక్కనే గల చెరువు (ఈస్ట్ లేక్)ను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నారు. లోకేష్ స్ఫూర్తితో సెల్ కాన్ సంస్థ వారు కేటాయించిన రూ.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో కాజ చెరువును అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నారు. కాజ చెరువు విస్తీర్ణం 17 ఎకరాల 18 సెంట్లు ఉంది. పర్యావరణ పరిరక్షణకు గాను కాజ చెరువు చుట్టూ పెద్దయెత్తున మొక్కలు నాటుతున్నారు. సుమారు 1.6 కిలోమీటర్ల మేర వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నారు. చుట్టూ ఫెన్సింగ్ వేసి, చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా గ్రౌండు సిద్ధం చేస్తున్నారు. ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. జనావాసాల మధ్య ఉన్న చెరువు రూపరేఖలు పూర్తిగా మారిపోతుండటంతో గ్రామస్తుల్లో హర్షం వ్యక్తమవుతోంది. చెరువు అభివృద్ధి పనులు పూర్తయితే ఒక పిక్నిక్ స్పాట్‌గా నిలిచిపోతుందనడంలో అతిశయోక్తి లేదు. రూరల్ ప్రాంతాల్లో మరో ఎనిమిది పార్కులు అభివృద్ధి చేయనున్నారు. జాతీయ రహదారి కాజ పశ్చిమ వైపు కూడా మరో పార్కు, చినకాకాని, నిడమర్రు, నవులూరు, ఆత్మకూరు, నూతక్కి, నులకపేట, పెనుమాక గ్రామాల్లోని చెరువులను కూడా ఇదే తరహాలో అభివృద్ధి చేసేందుకు మంత్రి లోకేష్ కార్యచరణ చేపట్టారు. ఇప్పటికే మంగళగిరి టిడ్కో గృహ సముదాయాల వద్ద ఆరెక రాల్లో మెగా పార్కు నిర్మాణ పనులు చురుగ్గా జరు గుతున్నాయి. పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా పెట్టుకుని 'స్వచ్ఛ మంగళగిరి'గా తీర్చిదిద్దాలనే లక్ష్యం దిశగా లోకేష్ ముందుకు సాగుతున్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర-దుగ్గిరాల: రాష్ట్రంలో కొత్తగా ఏర్పా టైన మెడికల్ కాలేజీ లను ప్రైవేటీకరించా లన్నా కూటమి ప్రభుత్వం నిర్ణయం వల్ల భవిష్యత్తులో అల్పాదాయం ఉన్న మైనార్టీ వర్గాలపై తీవ్ర ప్రభావం చూపు తుందని, దానివల్ల విద్యార్థులు, వైద్యులు అయ్యే విషయం ప్రశ్నార్థకంగా మారనుందని వైసీపీ మైనార్టీ సీనియర్ నాయకులు షేక్ సుభాని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం దుగ్గిరాల మూర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణంకు తీసుకున్న నిర్ణయంతో మైనార్టీ వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ఇబ్బంది పడకుండా ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో ఏకంగా 17కొత్త మెడికల్ కాలేజీలను మంజూరు చేయించి అందులో 5 మెడికల్ కాలేజీలను పూర్తి చేశారని, మరోరెండు కాలేజీల్లో దాదాపు అన్ని వసతులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచారన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు పునరాలోచించి తక్షణమే మెడికల్ కాలేజీ పై అమలు పరుచనున్న పి.పి.పి విధానాన్ని ఉపసంహరించు కోవాలన్నారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ జానీ సాహెబ్, షేక్ జిలానీ పాల్గొన్నారు.

మాజిక్ డ్రైన్ పర్యావరణ హితం

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : మాజిక్ డ్రైన్ పర్యావరణహితం అని ఉపాధి హామీ పథకం డైరెక్టర్ వైవీకే షణ్ముఖ్ కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా, ప్రయోగాత్మకంగా చేపట్టిన మాజిక్ డ్రైన్ నిర్మాణము గురించి గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా, ప్రకాశం జిల్లాలకు చెందిన 75 మంది ఉపాధి హామీ పథకం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెం గ్రామ శివారు బుర్రావారి పాలెంలో మంగళవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ మాజిక్ డ్రైన్ నిర్మాణం వలన కలిగే ప్రయోజనాలు, నిర్మాణము చేసేటప్పుడు తీసుకోవలసిన నాణ్యతా ప్రమాణాల గురించి అవగాహన కల్పించారు. ఇది గ్రామీణ ప్రాంతాలకు అనువైన, పర్యావరణహితమైన వ్యవస్థ అని అన్నారు. మాజిక్ డ్రైన్ల నిర్మాణపు అంచనా విలువ ఒక్కొక్క దానికి లక్ష రూపాయలకు మించకుండా ఉండేలా చూడాలన్నారు. మంచినీటి పైప్ లైన్ ఉన్న రోడ్ల నిర్మాణం చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం అడిషనల్ కమిషనర్ శివప్రసాద్, జాయింట్ కమిషనర్ సునీత, చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్, డ్వామా పీడీ శంకర్, ఏపీడీ శ్యామలాదేవి, ఎంపీడీఓ శివపార్వతి, సర్పంచ్ జగన్మోహనరావు పాల్గొన్నారు.

సంఘానికి అండగా నిలవాలి: మాలకొండయ్య

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆంధ్రప్రదేశ్ విశ్రాంత పోలీస్ అధికారుల సంఘానికి సభ్యులు అండగా నిలవాలని ఈ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మాల కొండయ్య పిలుపునిచ్చారు. సంఘానికి విశ్రాంత పోలీసు అధికారులు ఉదరూ చేదోడు వాదోడుగా నిలిచి కింది స్థాయి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. ఆర్కే బీచ్ కార్యాలయంలో సంఘ వార్షిక సమావేశం విశ్రాంత డీఐజీ కె.లక్ష్మణ మోహన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. గౌరవ అధ్యక్షుడు సిఆర్ నాయుడు మాట్లాడుతూ అసోసియేషన్ సమావేశాలకు అందరూ హాజరై యోగక్షేమాలు తెలుసుకుంటూ సహాయం చేయాలని సూచించారు. విశ్రాంత డిఐజి గోపాలకృష్ణ మాట్లాడుతూ చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. విశ్రాంత డిఐజి గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ విశాఖపట్నం రేంజ్ పరిధిలో విశ్రాంత పోలీసు సమస్యలను పరిష్కరిస్తానన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని సంఘ సభ్యుల సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కోశాధికారి డాక్టర్ కె.వి నారాయణ, సంయుక్త కార్యదర్శి సిహెచ్ చక్రపాణి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కె.రామకృష్ణ విజయవాడ అధ్యక్షుడు ఎఎస్ఎన్ రెడ్డి, విశాఖపట్నం పోలీసు కమిషనర్ శంకర్ భాగ్చి, విశాఖ డీఐజీ గోపీనాథ్ జెట్టి, విశ్రాంత డిఐజిలు కె.బాలకొండయ్య, వి.వి.గోపాలకృష్ణ, సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ ప్రసాద్ పాల్గొనగా.. కోశాధికారి ప్రేమ్ బాబు వందన సమర్పణ చేశారు.

ఘనంగా స్మార్ట్ ఇండియా అంతర్గత హ్యాకథాన్

విశాలాంధ్ర-మంగళగిరి : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం స్మార్ట్ ఇండియా అంతర్గత హ్యాకథాన్-2025ను ఘనంగా నిర్వహించింది. ఈ హ్యాకథాన్ యువతకు తమ ప్రతిభను, పారిశ్రామిక ఆలోచనలను ప్రదర్శించేందుకు ఉత్సాహపూరితమైన వేదికను అందించడంతో పాటు, ఆలోచనల సృష్టి, సృజనాత్మకత, వినూత్నత ప్రక్రియను అర్థం చేసుకునే విలువైన అనుభవాన్ని కల్పించింది. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కె.గంగాధరరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వీరయ్య, సమన్వయకర్త డాక్టర్ యు.సూర్య కామేశ్వరి, ప్యానల్ సభ్యురాలు డాక్టర్ కె.లావణ్య. పాల్గొని విద్యార్థులను ఉత్సాహ రిచారు. జాతీయ స్థాయిలో ప్రభావం చూపే వినూత్న పరిష్కారాలను ఆవిష్క రించేందుకు ఈ వేదికను సమర్థవంతంగా వినియోగించుకోవాలని వారు సూచించారు. డాక్టర్ జి.నీలిమ, విభాగం గెస్ట్ ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు

విశాలాంధ్ర-పెదకాకాని : మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో దసరా ఉత్సవాలలో భాగంగా మంగళవారం భ్రమరాంబదేవి అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. దసరా ఉత్సవాలు ఆలయ స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు పర్యవేక్షణలో జరిగినట్లు ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. యాగశాల నందు భక్తులు రుద్ర, చండీ హోమములు జరిపించుకున్నారు. దేవస్థానమునకు విచ్చేసిన భక్తులు అన్నప్రసాదము స్వీకరించినారు. సాంస్కృతిక కార్యక్రమములలో భాగంగా మంగళవారం సాయంత్రం పివిఎ.ప్రసాద్, విజయవాడ వారిచే భక్తిరంజని, కుప్పాకృష్ణవేణి, విజయవాడ వారిచే కూచిపూడి నృత్యం, ఏ.వి.ప్రసాదరావు, గుంటూరు వారిచే రామాంజనేయ యుద్ధం నాటకం నుండి యుద్ధం సీను, పల్నాటి సుబ్బారావు, గుంటూరు వారిచే గణపతి మహత్యం నాటకం నుండి సీను భక్తులను రంజింపజేసినవి.

ప్రమాదంలో ప్రముఖ ధార్మికవేత్త అమీర్ మృతి

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరుకు చెందిన ప్రముఖ ధార్మికవేత్త, తబ్లిగ్ జమాత్ పొన్నూరు మండల అమీర్ మగ్బుల్ జానీ బేగ్ మంగళవారం చేబ్రోలు-నారాకోడూరు మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. స్కూటీ టైర్ బరస్ట్ అవ్వడంతో ఈ ప్రమాదం జరిగింది. వడ్లమూడిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో పొన్నూరులో విషాద ఛాయలు అలుముకున్నాయి.

స్వస్త్ నారి సశక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరాలు

విశాలాంధ్ర-తెనాలి : దేశ వ్యాప్తంగా జరుగుతున్న స్వస్త్ నారి సశక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరంలో భాగంగా తెనాలి పట్టణంలోని స్థానిక గంగానమ్మపేట, సుల్తానాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. గంగానమ్మపేట వైద్య శిబిరాన్ని స్థానిక 36 వార్డు కౌన్సిలర్లు తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, 38వ వార్డు కౌన్సిలర్ వీర్లపాటి విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించగా, సుల్తానాబాద్ వైద్య శిబిరాన్ని స్థానిక కౌన్సిలర్ పి.జయపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మొవ్వయేసుబాబు, గంగానమ్మపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఉప వైద్యారోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఇరుగుల అన్నపూర్ణ పర్యవేక్షించారు. నందులపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ వేమూల ప్రియాంక మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠఉమాకాంత్, ఆరోగ్యవిస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ఫైలేరియా సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నంది ఇన్వెస్టిగేషన్ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థకు 'గోల్డ్ కేటగిరి' అవార్డు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు కేంద్రంగా పని చేస్తున్న నంది ఇన్వెస్టిగేషన్ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థకు (వెర్టిస్) అంతర్జాతీయ కంపెనీ గోల్డ్ కేటగిరి అవార్డు అందచేసింది. ఏపీలో నేషనల్ హైవే అథారిటీ సంస్థ జాతీయ రహదారులు నెంబర్ 5, 9లోని టోల్ ప్లాజాలకు నంది ఇన్వెస్టిగేషన్ సెక్యూరిటీ సర్వీసెస్‌కు 2014 నుంచి లేన్ ఆపరేషన్స్, మొబైలింగ్ పెట్రోలింగ్ నిర్వహణలో ఏ రిమార్కులు లేకుండా సేవలు అందించినందుకు అంతర్జాతీయ కంపెనీ "వెర్టిస్ ఈ నెల 19న ముంబైలోని పూన ఎక్స్‌ప్రెస్ హైవే లోని నవోటల్‌లో జరిగిన సదస్సులో నంది ఇన్వెస్టిగేషన్ సెక్యూరిటీ సర్వీసెస్ మేనేజింగ్

పార్ట్‌నర్ కాళహస్తి సత్యనారాయణకు 'వెర్టిస్' అధినేతలు డాక్టర్ జాఫర్ ఖాన్, గౌరవ్ చంద్ర, కిరణ్ బాబు ఆపరేషన్స్ ఆఫీసర్లు గోల్డ్ క్యాటగిరి కింద ప్రశంసా పత్రాన్ని, షీల్డ్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా టోల్ ప్లాజా చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ కిరణ్ బాబు, చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్లు హరి పాండురంగ స్వామి, మాచర్ల రాజారావు, టోల్ ప్లాజా మేనేజర్లు, నేషనల్ హైవే అథారిటీ సిబ్బంది అభినందనలు తెలిపారు. మంగళవారం గుంటూరులోని నంది ఇన్వెస్టిగేషన్ సెక్యూరిటీ సర్వీసెస్ ఆఫీసులో సంస్థ సిబ్బంది హెచ్ఆర్ మేనేజర్ ఎన్. సత్యసాయి, ఎగ్జిక్యూటివ్ వి.లిడియా, మేనేజర్ జి.ఉమా మహేశ్వరరావు, సెక్యూరిటీ సిబ్బంది మిత్రులు ఘనంగా సత్కరించారు. సంస్థ ఎండి కాళహస్తి సత్యనారాయణ మాట్లాడుతూ అవార్డు దక్కడానికి సిబ్బంది, అధికారులు చేసిన కృషి మరువలేనిదన్నారు. ఇలాంటి అరుదైన పురస్కారాన్ని అందుకున్న కాళహస్తికి పలువురు అభినందనలు తెలిపారు.

అమ్మవారికి అన్నపూర్ణాదేవి అలంకరణ

విశాలాంధ్ర-దాచేపల్లి : దసరా నవరాత్రుల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి పలు చోట్ల వివిధ అలంకరణలు చేశారు. దీనిలో భాగంగానే స్థానిక కొట్ల బజారులో ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి అన్నపూర్ణాదేవి అలంకరణ చేశారు. అర్వపల్లి భాగ్యలక్ష్మి, స్వామి హైమావతి తది తరులు అమ్మవారి గీతాలను ఆలపించారు. భక్తులు కుంకుమ పూజలు చేశారు. శ్రీవీర్ల అంకమ్మ తల్లి ఆలయం, గాయత్రీదేవీ అమ్మవారి ఆలయం, శ్రీలక్ష్మి తిరుపతమ్మ అమ్మవారి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలను రోజు వారీ ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఆదాయ పెంపుపై దృష్టి సారించాలి

విశాలాంధ్ర-దుర్గి : గ్రామాల్లో సొంత ఆదాయం పెంపుదల ఏవిధంగా రాబట్టాలో సర్పంచులు, కార్యద ర్శులు దృష్టి సారించాలని ఎంపీడీవో శివప్రసాద్ సూచించారు. ఏపీ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శిక్షణ సంస్థ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీలలో సొంత ఆదాయ వనరుల పెంపుదల(ఓఎస్ఆర్) రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పన్నుల ద్వారా ఆదాయం, పన్నులు లేకుండా వచ్చే ఆదాయం గురించి వివరించారు. ఈ కార్యక్రమ శిక్షకులు నాగులు నాయక్ మాట్లాడుతూ ఆదాయ మార్గాలను బలోపేతం, ఓఎస్ఆర్‌ను మెరుగుపర్చడానికి తీసుకోవలసిన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

త్రిపుర సుందరి దేవీగా అమ్మవారు



విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక బోసు బొమ్మ సెంటర్ వద్ద గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి శరన్నవరాత్రుల సందర్భంగా మంగళవారం ఆలయంలోని మూలవిరాట్ అయిన అమ్మవారికి బిస్కెట్ ప్యాకెట్లతో అలంకరించారు. కళ్యాణ మండపం నందు ప్రత్యేక అలంకారం శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి కొలువు తీర్చారు. అనంతరం కమిటీ వారు మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాలకు పట్టణ ప్రముఖులు, రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు జొన్నలగడ్డ బాబ్జి, గౌరవ అధ్యక్షులు తాతా వెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ అమర్నాథ్, రెడ్డి నగేష్ బాబు, కోశాధికారి పెండ్యాల సురేష్, కొల్లిపర వెంకట నాగేశ్వరరావు, సదావర్తి సంఘం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని పూజ అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బాండ్ లేకుండా మొక్కజొన్న వేయరాదు

విశాలాంధ్ర-దుర్గి : ఓబులునిని పల్లిలో మంగళ వారం జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అమీర్ రెడ్డి మాట్లా డుతూ విత్తన మొక్కజొన్న వేసే ప్రతి రైతు కూడా తప్పని సరిగా కంపెనీ వద్ద నుంచి బాండ్ తీసుకోవాలని తెలిపారు. తరువాత విత్తనాల కంపెనీ వారు చెల్లించవలసిన డబ్బుల్లో వ్యత్యాసాలు ఉన్నా పరిష్కరించుకోవడానికి వీలు అవుతుందన్నారు. మండలంలోని కౌలు రైతులు అందరు సంబంధిత రైతు సేవ కేంద్రంను సంప్రదించి కౌలు రైతు కార్డు పొందాలని సూచించారు. పంట నమోదు ప్రక్రియ ఈ నెల 30తో గడువు ముగుస్తుందని, రైతులందరూ కూడా పంట నమోదు చేసుకోవాలని కోరారు.

ప్రజారోగ్యాన్ని విస్మరించిన వైసీపీ: ప్రత్తిపాటి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలు.. ముఖ్యంగా మహిళల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా ప్రవేశపెట్టిన 'స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం ఎంతో విశిష్ట మైనదని, 15 రోజులు నిర్వహిస్తున్నఈ కార్యక్రమం నిజంగా పేదలకు వరమని, ప్రతి ఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. పట్ట ణంలోని 100 పడకల ఆసుపత్రిలో ఈ పథకాన్ని ప్రత్తిపాటి లాంఛనంగా ప్రారంభించారు. అనం తరం రక్తదాన శిబిరం పరిశీలించి ఆసుపత్రిలోని వైద్యసేవలపై రోగుల్ని ప్రశ్నించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని పూర్తిగా విస్మరించిందని, చివరకు ఎన్టీఆర్ వైద్యసేవ బకాయిలు కూడా చెల్లించకుండా నెట్ వర్క్ ఆసుపత్రులకు బకాయిలు పెట్టిందని, సీఎం.ఆర్.ఎఫ్ సాయాన్ని కూడా నిలిపివేసిందని చెప్పారు. అలాంటి వారు మెడికల్ కాలేజీలు కట్టామని చెప్పుకుంటూ, వైద్యరంగంలో తాము చేసిన అవినీతి.. వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, ఉనికి కాపాడుకోవడానికే నేడు రాద్ధాంతం చేస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. పక్క నియోజక వర్గాలకు కూడా ఉపయోగపడే 100 పడకల ఆసుపత్రిలో నాణ్యమైన వైద్యసేవలు అందితేనే ప్రజలు సంతోషిస్తారన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి ఐఏఎస్ అధికారి కృష్ణతేజ బాగా సహకరించారని ప్రత్తిపాటి చెప్పారు. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో అందించే ఉచిత వైద్యసేవల్ని ఇక్కడి వైద్యసిబ్బంది వినియోగించుకోవాలని, అత్యవసరమైన చికిత్సల కోసం వచ్చేవారిని, ముఖ్యంగా క్యాన్సర్ రోగుల్ని గుంటూరు నాట్కో వైద్యకేంద్రానికి రిఫర్ చేయాలన్నారు. అక్కడ క్యాన్సర్ చికిత్సను ఉచితంగా అందిస్తున్నారని, ఆ సేవలు పేదలకు దక్కేలా చూడాలని స్థానిక వైద్యసిబ్బందికి సూచించడం జరిగింద న్నారు. నాట్కో వైద్య విభాగం డైరెక్టర్ అయిన సదా శివరావు, తిరుపతి స్విమ్స్ ఆసుపత్రి వారి సహకా రంతో త్వరలోనే చిలకలూరిపేటలో మోకాలి మార్పి డి శస్త్రచికిత్సలకు సంబంధించి ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వ రరావు, మున్సిపల్ కౌన్సిలర్లు , టీడీపీ నాయకులు, డాక్టర్ మరేళ్ల ఇందిరా, హాస్పిటల్ సూపరిడెంట్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ భవాని పాల్గొన్నారు.

మహిళ ఆరోగ్యమే దేశానికి మహాభాగ్యం: ఆళ్ల హరి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మహిళ ఆరోగ్యమే దేశానికి మహాభాగ్యమని, కొవ్వొత్తిలా తాను కరిగి పోతూ కుటుంబానికి వెలుగునిచ్చే స్త్రీ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులపై ఉందని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. స్వస్థ్ నారీ-స్వశక్తి పరివార్ అభియాన్ కార్య క్రమంలో భాగంగా మంగళవారం శ్రీనివాసరావుతోటలోని అర్బన్ హెల్త్ సెంటర్లో మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను కూటమి నేతలతో కలిసి ఆయన సందర్శించారు. ఇంటిల్లిపాది బాగోగులు చూసుకునే మహిళల ఆరోగ్యాన్ని సంరక్షనే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కేవలం మహిళల కోసమే దేశ వ్యాప్తంగా పది లక్షలకు పైగా మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేయటం ఎంతో ముదావాహమన్నారు. మహిళలు భిన్నమైన అనారోగ్య కారణాలతో అల్లాడుతున్నారని అయన ఆవేదన వ్యక్తం చేశారు. క్యాన్సర్ వంటి మహమ్మా రులు స్త్రీ లనే ఎక్కువగా చుట్టుముడుతునాయని ఆందోళన చెందారు. ముందస్తు ఆరోగ్య పరీక్షలతో తగు జాగ్రత్తలు తీసున్నప్పుడే మహిళలు ఆరోగ్య కరమైన కుటుంబాలను సృష్టించగలుగుతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు అప్పిశెట్టి రంగా, విమలాదేవి, ఏలూరి లక్ష్మీ, దుర్గా భవాని, సాంబశివరావు, తోట గోపి, శ్రీను నాయక్, టీడీపీ డివిజన్ అధ్యక్షులు చింతకాయల వెంకట సాయి, సుభాని, బియ్యం శ్రీను, జిలాని, మస్తాన్ వలి, వడ్డే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమానికే జీఎస్టీ సంస్కరణలు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: కూటమి ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు, మినహాయింపులతో పేద,బడుగు, బలహీన వర్గాలకు మేలు జరుగుతుందని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి చెప్పారు. మంగళవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపువల్ల పేదలు వినియోగించే నిత్యవసరసరుకులు ధరలు తగ్గాయని, ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయం దేశ ఆర్థికాభివృద్ధి వైపు పయనిస్తుందని వెల్లడించారు. మధ్య తరగతి వినియోగదారులు కొనుగోలు చేసే 375 రకాల ఉత్పత్తులపై పన్ను రేట్లు తగ్గించడం వినియోగదారులకు లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. ప్రజల ఆర్థిక పరిస్థితులు బాగుపడకుండా ఏ దేశమూ సంపన్న రాజ్యం కాలేదని బాలాజి వివరించారు. జీడీపీ ఎంత పెరిగినా, ఆ ప్రగతి తలసరి ఆదాయాల్లో ప్రతిఫలించకపోతే- అలాంటి అభివృద్ధి అర్థవంతమైనది కాదని గుర్తించిన కేంద్రప్రభుత్వం ఈ దిశగా నిర్ణయం తీసుకుందన్నారు.

ఆదం షఫీకి అభినందనలు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: పట్టణానికి చెందిన ప్రైవేట్ కంప్యూటర్ అధ్యాపకుడు షేక్ ఆదం షఫీ ఇటీవల ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాన్ ఇండియా విద్యా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయనను ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఫోరం ఆధ్వర్యంలో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 13 సంవత్సరాలు పైబడి ప్రైవేట్ అధ్యాపక వృత్తిలో కొనసాగుతున్న ఆదం షఫీ ఉచిత కంప్యూటర్ విద్యను విద్యార్థులకు నేర్పిస్తూ ఆదర్శంగా నిలిచారన్నారు. గతంలో గవర్నమెంట్ ప్రాజెక్ట్ మెప్మా ద్వారా, అలాగే ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా అనేకమంది విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ విద్య నేర్పించడం జరిగిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రైవేటు ఉపాధ్యాయులు షేక్. జాఫర్, కాకుమాను. అంజన్ రావు, ఐ వి సుబ్బారావు, చుండి శివప్రసాద్, పార్థసారథి, పీటి మనోహర్ తదితర ఉపాధ్యాయులు అభినందించారు.

వేప కషాయంతో గులాబి పురుగు నివారణ

విశాలాంధ్ర-యడ్లపాడు : వేప కషాయంతో గులాబీ రంగు పురుగును అదుపులో ఉంచాలని యడ్లపాడు మండల వ్యవసాయ శాఖాధికారి హరిప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత ప్రత్తి పంట కాయ దశలో గులాబీ రంగు పురుగు ఆశించడం వలన ఎక్కువ నష్టం జరుగుతుందని, గుడ్డి పువ్వులను ఏరివేసి దూరంగా తగలబెట్టాలని కోరారు. కాయలలో గులాబీ రంగు పురుగు ఉనికిని గుర్తించాలన్నారు. లింగాకర్షణ బుట్టలలో వరుసగా ఎనిమిది రెక్కల పురుగులు పడితే తగు చర్యలు చేపట్టాలని వివరించారు. గులాబీ రంగు పురుగు గుడ్లు పెట్టకుండా మొదట వేప గింజల కషాయంతో పిచికారి చేసి దాని ఉధృతిని తగ్గించాలని తెలిపారు. 100 రోజులలోపు పైరుకు సింథటిక్ పైరెథ్రాయిడ్స్ మందులు వాడకూడదని, ఎక్కువ వాడినచో రసం పీల్చు పురుగుల ఉధృతి పెరుగుతుందని తెలిపారు. వంద రోజులు లోపల ప్రొఫెనోఫోస్, థయోడికర్బన్ వంటి మందులు పిచికారి చేసుకోవాలన్నారు. ప్రభుత్వం బ్లాక్ బర్లీ పొగాకు సాగును ఈ సంవత్సరం పూర్తిగా నిషేధం చిందని, ఎవరు పొగాకు సాగు చేయవద్దని హెచ్చ రించారు. పొగాకు సాగు నిషేధం అమలుకు మండల స్థాయిలో తహశీల్దార్ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి, పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ మెడికల్ ఆఫీసర్, ఒక అభ్యుదయ రైతుతో కలిపి టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసామని, రైతులు గమనించాలని కోరారు. సమీప పొలాలలోని ప్రత్తి పైరును పరిశీలించి తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది ఎన్.అనుపమ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-పల్నాడు జిల్లా: రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి, భూసార పరీక్షా ఫలితాల ఆవశ్యకతను గ్రామ స్థాయిలో తెలియ పరచాలని, ఇ-పంట నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని, కిసాన్ డ్రోన్లను రైతులు ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్ల అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యాన, నీటి పారుదల, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, సూక్ష్మ నీటిపారుదల, ప్రకృతి వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి శాఖలకు, సంబంధించిన అధికారులతో మంగళవారం సమన్వయ కమిటీ సమావేశం వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బ్లాక్ బర్లీ పొగాకు సాగును రబీ 25-26 సీజన్‌లో పూర్తిగా నిషేధించాలని, ఆ సందేశం గ్రామాలలో రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది తెలియపరచాలని అన్నారు. వరి, ప్రత్తి, మొక్కజొన్న పంటల సాగు, దిగుబడి వివరాలు, మార్కెటింగ్ గురించి, పొగాకుకు ప్రత్యామ్నాయ పంటల సాగు, రబీ శనగ విస్తీర్ణం ఎంత విస్తీర్ణంలో సాగు అవుతుందని అడిగారు. యూరియా కొరత రాకుండా సకాలములో రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ గారు గ్రామ స్థాయిలో బ్యాంకు అధికారిని నియమించు కొని రైతు సేవా కేంద్ర సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ కౌలు రైతులకు రుణ మంజూరు త్వరిత గతిన ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వెంకటరావు ఇప్పటి వరకు సాగు అయిన వివిధ పంటల విస్తీర్ణం, వారి శాఖ ద్వారా అమలు చేయుచున్న ప్రభుత్వ పథకాల సబ్సిడీ వివరములు ఆయిల్ పామ్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం క్రింద 15 మండలాలలో సాగు జరుగుచున్నదని తెలిపారు. అవకాడో, డ్రాగన్ ఫ్రూట్ సాగును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ పిడి ఝాన్సీ డ్రోన్ దీదీ పథకం క్రింద 28 మండలాలకు 28 చొప్పున ప్రతిపాదనలు ప్రభుత్వం వారికి సమర్పించారని తెలిపారు. కాల్వ చివరి భూమి వరకు పంట పొలాలకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ అధికారులు జిల్లాలో 20 కోల్డ్ స్టోరేజ్ లు రైతులకు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అమల కుమారి ప్రకృతి వ్యవసాయం సాగు పద్ధతులను వివరించారు. గ్రామ స్థాయిలో సిబ్బంది రైతుకు పంటల సరళి గురించి వివరించాలని, ఉద్యాన, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను సమన్వయము చేసుకుంటూ పథకాన్ని విస్తృతం చేయాలని, రైతుసేవాకేంద్రం సిబ్బందికి శిక్షణా కార్యక్రమము జిల్లాలో రెండు రోజులు ముందుగా నిర్ణయించిన తేదీలలో ఒకేసారి నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్లో సాగు చేస్తున్న వ్యవసాయ పంటల వివరాలను, రైతులకు కల్పిస్తున్న సదుపాయాలను జిల్లా వ్యవసాయ అధికారి ఎం జగ్గారావు వివరించారు. సమావేశంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మానవాళికి గొప్ప వరం ఆయుర్వేదం: భాష్యం

విశాలాంధ్ర- గుంటూరు సిటీ: ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి జయంతిని జాతీయ ఆయుర్వేద దినోత్సవంగా జరుపుకోవడం మనం మన మూలా లను స్మరించుకోవడమేనని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. మంగళవారం జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని భాష్యం మెడెక్స్, మెడి ఎయిమ్స్ క్యాంపస్‌లలో ధన్వంతరికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మన పూర్వీకులు మానవాళికి ఇచ్చిన గొప్ప వరం ఆయుర్వేదం అని దానిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎంతో మంది మునులు, ఋషులు ఆయుర్వేదం ద్వారా ఎన్నో వ్యాధులను నయం చేశారన్నారు. వైద్య విద్యార్థులు వైద్యవృత్తిని వ్యాపార ధోరణిలో కాకుండా మానవత్వ విలువలను పెంపొందించేలా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో భాష్యం మెడెక్స్ ప్రిన్సిపల్ హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-తాడేపల్లి: వడ్డేశ్వ రంలోని కేఎల్ యూనివర్సిటీలో లారెన్స్, మైకో సంస్థల ఆధ్వ ర్యంలో ఉచిత కంటి పరీక్షా వైద్య శిబిరం నిర్వహించారు. 270 మంది విద్యార్థులు, సిబ్బంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. ప్రముఖ నేత్ర వైద్యులు ఈ శిబిరంలో పాల్గొని కంటి చూపులో లోపాలు, కళ్లలో తలెత్తే సాధారణ సమస్యలను గుర్తించి తగిన సూచనలు ఇచ్చారు. అవసరమైన వారికి కాంటాక్ట్ లెన్స్‌లు ఉచితంగా అందజేశారు. అలాగే డ్రైవర్లకి అందరికీ కంటి పరీక్షలు పూర్తిగా జరిపి సమగ్ర నివేదికలు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్. పార్థసారది వర్మ, ప్రో-వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖర రావు, రిజిస్ట్రార్ డాక్టర్.కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ కె.ఆర్.ఎస్. ప్రసాద్, అసోసియేట్ డీన్ డాక్టర్ రూత్ రమ్య, హాబీ క్లబ్ ఇన్‌చార్జ్ డాక్టర్. సుభాకర్ రాజు, వైఆర్‌సి ప్రొఫెసర్ ఇన్ చార్జ్ డాక్టర్ ఆర్.సుప్రియ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మధుసూదన్ రావు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంపై అవగాహన అవశ్యం: భాష్యం రామకృష్ణ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మన జీవన శైలి సక్రమమైన పద్ధతిలో లేనందు వలనే నేడు మనం అనేక రోగాలబారినపడుతున్నామని భాష్య విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ అన్నారు. ఆయుర్వేద వైద్యం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవటం వలన సగం రోగాలు మన దగ్గర నుంచి వైదొలిగినట్లేనన్నారు. అందుచేతనే ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 23న ఆయుర్వేద దినోత్సవాన్ని భారత ప్రభుత్వం జరుపుతున్నట్లు తెలిపారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక హాస్పిటల్ నందు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని భాష్యం రామకృష్ణ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం చాలా పురాతనమైన వైద్యమని, దీని వలన ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ ఉండవన్నారు. ముఖ్యంగా ఆయుర్వేదం గురించి తెలుసుకుని దాని వలన ఒనకూరే ప్రయోజనాలను పొందాలని సూచించారు. బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం పట్ల అవగాహన కలిగించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తుందన్నారు. కొవిడ్ సమయంలో మోదీ ఆయుర్వేద ప్రాముఖ్యతను తెలియజేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆయుర్వేద వైద్యాన్ని ప్రజల ముందుకు తీసుకొచ్చేందుకు మోదీ విశేష కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక హాస్పిటల్ చైర్మన్, పంచకర్మ వైద్య నిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆయుర్వేద దినోత్సవాన్ని భారత ప్రభుత్వం తొలుత 2016లో ప్రకటించిందని, దీనిని గతంలో ధన్వంతరి జయంతి రోజున పాటించేవారని పేర్కొన్నారు. ఇది ప్రకృతిలో సమతుల్యతను సూచిస్తుందని, పేపుల్ అండ్ ప్లానెట్ అనే థీమ్ ఆయుర్వేదాన్ని స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలతో అనుసంధానించటానికి సహాయపడుతుందన్నారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు రూ.90వేల విలువ కలిగిన మందులు ఉచితంగా అందజేశారు.
ఈ శిబిరంలో వైద్య బృందం డాక్టర్ రాహుల్ చంద్ర, డాక్టర్ మౌనిక, డాక్టర్ భావన, మేనేజర్ మల్లేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, BOMMISETTY TULASI (Old name) W/O. B.Jagan Mohan Rao, Resident of 14-270/1, Nulakapeta, Tadepalli, Guntur District, A.P-522501. I have Changed my Name as TULASIDEVI JAGANMOHAN RAO BOMMISETTY (New Name) W/O. BOMMISETTY JAGANMOHAN RAO Hereafter my Name known as TULASIDEVI JAGANMOHAN RAO BOMMISETTY (New Name) W/O. BOMMISETTY JAGAN MOHAN RAO.

సాయి భాస్కర్‌లో రోబోటిక్ తొంటి మార్పిడి ఆపరేషన్లు

- వరల్డ్ క్లాస్ సంస్థ స్ట్రైకర్‌తో ఒప్పందం
- మాకో రోబోటిక్‌తో విప్లవాత్మక మార్పునకు శ్రీకారం
- జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కొత్త ఆవిష్క రణలకు ఎప్పుడు ముందు ఉండే సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత, సీనియర్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మరో నూతన ఆవిష్కరణకు నాంది పల కనున్నారు. ఇప్పటివరకు కేవలం మోకీలు మార్పి డిలో మాత్రమే రోబోటిక్‌ను వినియోగిస్తుండగా ఇకపై తొంటి మార్పిడి శస్త్ర చికిత్సలను సైతం రోబోటిక్ ద్వారా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ప్రపంచ ప్రఖ్యాత రోబోటిక్ సంస్థ స్ట్రైక ర్‌తో ఒప్పందం చేసుకోవడం జరిగిందని చెప్పారు. దీనిలో భాగంగా రోబోటిక్‌ను, అందుకు తగిన సాంకేతిక సహకారాన్ని సంస్థ అందించనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అరండల్ పేట లోని సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలను తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్టమొదటిసారిగా తొంటి మార్పిడి ఆపరేషన్లలో మాకో హిప్ అండ్ నీ రోబో టిక్‌ను ప్రవేశపెడుతు న్నామని చెప్పా రు. గడిచిన రెండు సంవ త్సరాలుగా రాష్ట్రం లోనే అత్యధికంగా తాము రోబోటిక్ మోకీలు మార్పిడి ఆపరేషన్లు నిర్వహిస్తున్న నేపథ్యంలో స్ట్రైకర్ సంస్థ తమతో ఈ ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. సోమవారం ఢిల్లీలోని స్ట్రైకర్ ఇండియా హెడ్ క్వార్టర్స్‌లో సంస్థ వైస్ ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్ అమన్ రిషితో కలిసి ఒప్పంద పత్రాలను మార్చుకున్నామని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కరోనాతో ఏర్పడిన దుష్పరిణామాలు తొంటి అరుగుదలపై తీవ్ర ప్రభావాన్ని చూపు తున్నాయని, దీని కారణంగా చిన్న వయసులోనే తొంటి మార్పిడి శస్త్ర చికి త్సలు చేయాల్సి అవసరం ఏర్పడుతుందన్నారు. అక్టోబర్ మొదటివారం నుంచి సాయి భాస్కర్ హాస్పిటల్‌లో రోబోటిక్ తొంటి మార్పిడి ఆపరేషన్లు అందుబాటులోకి రానున్నా యని నరేంద్ర రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో స్ట్రైకర్ నేషనల్ సేల్స్ మేనేజర్ ప్రశాంత్ మహేశ్వరి, రెండు తెలుగు రాష్ట్రాల మేనేజర్ పీటి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మహారాజశ్రీ గురజాల ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు

O.S. NO : 286/2020

పిటీషన్ :

బొమ్మిన పోతులూరయ్య .... వాది

వర్సెస్,

పొట్టూరు నాగరాజు .... ప్రతివాది

టు : పొట్టూరు నాగరాజు, తండ్రి కాశిదాసు, 1వ లైన్, ఏటి అగ్రహారం, గుంటూరు (పట్టణం) మరియు మండలం.

పై నెంబరు దావాలో శ్రీ కోర్టువారు ప్రతివాది అయిన మీకు సమను ఆర్డరు వేసియున్నారు. సదరు వాయిదా అనగా ది. 17-10-2025వ తేదీ అయి ఉన్నది. సదరు వాయిదా రోజు ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని లేక లాయరు గారి ద్వారా గానీ కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలసి ఉన్నది. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

బూసా రామాంజనేయులు
వాది తరపు న్యాయవాది
సెల్ : 9010848031

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 25న వెలగపూడిలో రాష్ట్ర సచివాలయం దగ్గర డీఎస్సీ నియా మక పత్రాలు అందజేస్తున్న కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాట్లను మంగళవారం పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్, విద్యాశాఖ కమిషనర్ విజయ రామ రాజు, జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ ఆరిఫ్ అఫీజ్, సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పరిశీలించారు. ప్రధాన వేదిక, పార్కింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు అందజేశారు. ట్రాఫిక్ సమస్యలు ఎక్కడా తలెత్తకుండా ముందస్తుగా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాల నుండి వచ్చే అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా తగు సూచన బోర్డులు ఏర్పాటు చేయాలని, తాగునీరు, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు కల్పించాలని అన్నారు. అధికారులందరు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. అధికారులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-దాచేపల్లి : రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితులను తక్షణమే ఆదుకోవాలని ముస్లిం హక్కుల పోరాట సమితి ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్ష, గౌరవాధ్యక్షులు కరాటే మాబ్బాష, సయ్యద్ ఇక్బాల్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మంగళవారం వారు దాచేపల్లిలో మీడి యాతో మాట్లాడారు. లక్షలాది మంది ఖాతాదారులు నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వారంతా పరిహారం కోసం దశాబ్దకాలం నుంచి ఎదురు చూస్తున్నట్లు పేర్కొన్నారు. కావున ఇప్పటికైనా బాధితులకు తగిన నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

బీఫార్మసీ పరీక్షల తనిఖీ

విశాలాంధ్ర-మంగళగిరి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న బి.ఫార్మసీ(రెగ్యులర్, సప్లమెంటరీ)పరీక్షలను మంగళవారం పీజీ, వృత్తివిద్య కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు తనిఖీ చేశారు. విశ్వవిద్యాలయం క్యాంపస్ ఫార్మసీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించి పరీక్షలు జరిగే తీరును పరిశీలించారు.ఆయన విద్యార్థుల హాల్ టికెట్లు,జవాబుపత్రాలు తదితర వాటిని పరిశీలించారు.అలాగే పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన సదుపాయాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించాలని ఆయన పరీక్షా కేంద్రం నిర్వహకులకు సూచించారు.ఈ సందర్భంగా సమన్వయకర్త ఆచార్య సుబ్బారావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం పరిధిలో బీ.ఫార్మసీ పరీక్షలు పారదర్శకంగా జరుగుతున్నాయన్నారు.నిత్యం పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరిగే తీరును తనిఖీ బృందాలు తనిఖీ చేస్తున్నాయని సుబ్బారావు పేర్కొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

విశాలాంధ్ర-దాచేపల్లి : గ్రామీణ మండలంలో ఈ నెల 24 నుంచి 27 వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ ఉల్లంగుల వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 24న రామాపురం సచివాలయంలో శ్రీనగర్, పొందుగల, రామాపురం, గామాలపాడు సచివాలయంలో గామాలపాడు ప్రజలు, 25న కేసానపల్లి సచివాలయంలో పెదగార్లపాడు, తక్కెళ్లపాడు, కేసానపల్లి ప్రజలు, 26న మాదినపాడు సచివాలయంలో కొత్తూరు, సారంగపల్లి అగ్రహారం, మాదినపాడు ప్రజలు, భట్రుపాలెం సచివాలయంలో కాట్రపాడు, భట్రుపాలెం ప్రజలు, 27న తంగెడ సచివాలయంలో తంగెడ ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులపై ఆందోళన వద్దు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: జిల్లాలో సీజనల్ వ్యాధులపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కొద్దిపాటి అప్రమత్తతో ప్రభుత్వం జారీ చేస్తున్న ఆరోగ్య సూచనలు, వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధుల నుంచి రక్షణ పొంద వచ్చని జిల్లా కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా తెలిపారు. మంగళవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, కమిషనర్ పులి శ్రీనివాసులు, శాసనసభ్యులు మహమ్మద్ నసీర్ అహ్మద్‌తో కలసి నగరపాలక సంస్థ పరిధిలో డయేరియా వ్యాధులు నమోదు అయిన ప్రాంతాలు ప్రగతి నగర్, వర్కర్స్ కాలనీ, రామిరెడ్డి తోట, సీతానగర్, నెహ్రూనగర్‌లో త్రాగునీరు సరఫరా, పారిశుద్యం, వైద్యసేవలను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు నమోదు అవు తున్న ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనుల నిర్వహణ, వాటర్ టెస్టింగ్ తదితర అంశా లను కమిషనర్ శ్రీనివాసులు, వైద్య చికిత్సలు, డోర్ టూ డోర్ సర్వే, అవగాహన కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డా.విజయలక్ష్మీ కలెక్టర్‌కు వివరిం చారు. ప్రగతి నగర్‌లో కలెక్టర్ ఇంటింటికి వెళ్లి తాగునీటి సరఫరా, కుటుంబ సభ్యుల ఆరోగ్యం పై ప్రజల నుంచి వివరాలు సేకరించారు. ప్రస్తుత వర్షకాలం నేపథ్యంలో మున్సిపల్ శాఖ సరఫరా చేస్తున్న తాగునీటిని, ఆర్వో ప్లాంట్ నీటిని సైతం పది నుంచి పదిహేను నిమిషాలు మరగకాచి చల్లార్చి తాగాలని తెలిపారు. పరిసరాలు పరిశు భ్రంగా ఉంచుకోవాలని, బయట ఆహారం తిన కుండా ఇంటిలోనే తాజాగా ఆహారం సిద్ధం చేసు కొని తినాలన్నారు. కొద్దిపాటి అనారోగ్య లక్షణాలు ఉన్న వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. ప్రగతి నగర్‌లో రహదారులపై నిలిచిన నీటిని తొలగించాలని, మంచినీటి కుళాయిల పైపులైన్లు డ్రైనేజీ కాల్వల్లో నుంచి వెళ్లకుండా పక్కకు మార్చా లని, డయేరియా కేసులు నమోదైన ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు వచ్చే వరకు తాగునీరు, ఇతర అవసరాలకు ట్యాంకర్ల ద్వారా సురక్షితమైన నీటిని సరఫరా చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఇళ్లలోను, కుళాయిలు వద్ద, వ్యక్తిగత ఆర్వో ప్లాంట్ లు, బోర్ల వద్ద వాటర్ శాంపిల్స్ తీసి నిరంతరం పరీక్షించాలన్నారు. ఎఎన్ఎం, ఆశాల సర్వేలెన్స్ టీంలు ఇంటింటికి వెళ్ళి ప్రతి ఒక్కరి

డయేరియా నమోదైన ప్రాంతాల్లో కలెక్టర్, ఎమ్మెల్యే పర్యటన

ఆరోగ్య వివరాలను నమోదు చేసేలా చర్యలు తీసు కోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. డయేరియా తో జీజీహెచ్ లో చికిత్స పొంది డిస్చార్జ్ అయిన సుద్దపల్లి డొంక వర్కర్స్ కాలనిలోని వెంకయమ్మను, కాకాని రోడ్డులోని సీతానగర్ లోని షేక్ కరీమున్నీసా ఇంటికి జిల్లా కలెక్టర్ వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వైద్యులు ఇచ్చిన మందులు క్రమం తప్పకుండా వాడాలని, వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. రామిరెడ్డితోట మూడవ లైనులోని మున్సిపల్ పాఠశాలలో నిర్వహిస్తున్న వైద్యశిబిరంను, రామిరెడ్డి తోట ప్రధాన రహదారిలో మెబైల్ వ్యాన్ లోని పరీక్ష కేంద్రంలో వాటర్ టెస్టింగ్ ను జిల్లా కలెక్టర్ పరిశీ లించారు. అనంతరం నెహ్రూనగర్ లోని రిజర్వాయ ర్లో తాగునీటిలో క్లోరిన్ శాతం పరీక్షలను పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ డి శ్రీనివాసు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి విజయలక్ష్మీ, ఇన్ చార్జి ఎస్ఈ సుందరరామిరెడ్డి, ఇన్చార్జి సీఎంహెచ్ డా.శోభారాణి, స్పెషల్ అఫీసర్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పి మురళి, కమ్యూనిటీ డీసీజ్ వైద్యనిపుణులు డా.శివ గోపాల్, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఎస్ ఈ దాసరి శ్రీనివాసరావు, స్పెషల్ అఫీసర్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పి మురళి తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలు నీట మునగకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలి

విశాలాంధ్ర-తాడేపల్లి: అధిక వర్షాలు, భారీ వర్షాలు కురిసి తాడే పల్లి మండలంలోని వడ్డేశ్వరం కొలనకొండ, గుండి మెడ, కుంచనపల్లి గ్రామాల పరిధిలో ఉన్న రైతుల పంట పొలాలు నీట మునగకుండా శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని, మురుగు సమస్య పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంటిఎంసి పరిధిలోని కొలనుకొండ పరిధిలోని వడ్డేశ్వరం నుండి గుండి మెడ వైపు వెళ్ళు కట్ట రోడ్డు వద్ద రైతుల మునిగిన పంట పొలాలను, రైతులు గండి కొట్టిన ప్రాంతాన్ని రైతు, కౌలు రైతు సంఘం నాయకులు పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు,ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, రైతు సంఘం నాయకులు అమ్మిశెట్టి రంగారావు, కానుగోలు కోటయ్య, కెవిపిఎస్ మండల నాయకులు నాగ పోగు విజయరాజు, తెలుగు రైతు సంఘం నాయకులు కొమ్మారెడ్డి వెంకటేశ్వరరావు, చిగురు పాటి సుబ్బారావు, కాసరనేని అంకినీడు తదితరులు నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన వారిలో ఉన్నారు.

లింగనిర్ధారణ చట్టం ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-తెనాలి : డివిజ న్‌లోని ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు, లేబొరేట రీలు లింగ నిర్ధారణపై ఎటు వంటి వాణిజ్య ప్రకటనలు ఇచ్చినా పిసిపిఎన్ డిటి చట్టం ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని తెనాలి ఉపజిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఇరుగుల అన్నపూర్ణ తెలియజేశారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం గురించి తెనాలి డివిజన్ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ సమావేశం మంగళవారం తెనాలి ఉపవైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మొదటిసారి నిబంధనలు ఉల్లంఘించిన కేంద్రాలకు మొదటి తప్పుగా 3 సంవత్సరాలు జైలుశిక్ష, 50 వేల రూపాయలు జరిమానా మరియు భారత్ వైద్య మండలి నుండి వారి ధ్రువీకరణ పత్రం 5 సంవత్సరాలు తొలగిస్తారని చెప్పారు. తదుపరి లింగనిర్ధారణకు పాల్పడితే 5 సంవత్సరాలు జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానాతో పాటు వారి ధృవీకరణ పత్రం శాశ్వతంగా తొలగిస్తారన్నారు. కమిటి మెంబర్స్ డాక్టర్ నరేంద్ర సింగ్, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ కె.సురేష్, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వినీల, జనరల్ మెడిసిన్ వైద్యులు డాక్టర్ వేముల ప్రియాంక, రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రటరి ముమ్మనేని భానుమతి, పెనుగొండ వెంకటేశ్వరరావు, నాళం శ్రీమన్నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన

విశాలాంధ్ర-మంగళగిరి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై గుంటూరు జిల్లా కలెక్టర్ సూచనలతో మంగళవారం మంగళగిరి కౌన్సిల్ హాలులో అవగాహన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.అలీమ్ బాషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అలీమ్ బాషా మాట్లాడుతూ, ప్రజలందరూ డయేరియా వంటి నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు కాచి, వడగట్టి, చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. నిల్వ ఆహారం, జంక్ ఫుడ్‌ను పూర్తిగా నివారించాలని, వేడిగా వండిన ఆహార పదార్థాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'డ్రగ్స్ రహిత గుంటూరు జిల్లా'కు కలిసికట్టుగా పనిచేద్దాం..

సౌత్ డీఎస్పీ భానోదయ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : అందరూ కలిసికట్టుగా పనిచేస్తే డ్రగ్స్ రహిత గుంటూరు జిల్లా సాధ్యం అవుతుందని సౌత్ డీఎస్పీ భానోదయ అన్నారు. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో ముఖ్యంగా యువతలో అవగాహన కల్పించేందుకు గుంటూరు జిల్లా పోలీస్ శాఖ, ఈగల్ విభాగంతో కలిసి ప్రత్యేకంగా డ్రగ్స్ వద్దు బ్రో ప్రచారాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా సోమవారం రాత్రి సౌత్ డీఎస్పీ భానోదయ నేతృత్వంలో నల్లపాడు సీఐ వంశీధర్ స్థానిక స్వర్ణభారతి నగర్‌లో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందన్నారు. ప్రతి యువకుడు, ప్రతి వ్యక్తి డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని సంకల్పం చేసుకోవాలని సూచించారు. డ్రగ్స్ సరఫరా, విక్రయం, వాడకం చట్ట రీత్యా నేరమని స్పష్టం చేశారు. అటువంటి నేరాలకు ఎవరైనా పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్ వాడకం లేదా విక్రయం ఎక్కడైనా కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కి సమాచారం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఆర్ఎస్ఐ సునీల్, నల్లపాడు ఎస్సై శిరీష, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఆయుర్వేద దినోత్సవం

విశాలాంధ్ర-బంటుమిల్లి :- స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆయుర్వేద దినోత్సవం ఘనంగా జరిగింది. కళాశాల సెమినార్ హాల్లో జరిగిన ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ జగన్మోహన్ మోహనరావు కీలకోపన్యాసం చేశారు. ధన్వంతరీ ఆచార్య జన్మదినం పురస్కరించుకుని ఏర్పాటుచేసిన 10 వ ఆయుర్వేద దినోత్సవం లోఆరోగ్యమే మహాభాగ్యం అని, ఇటువంటి ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటూ,ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. మన వంటగదిలోనే లభించే జీలకర్ర, వెల్లుల్లి, ఆవాలు, అల్లం మొదలైన వాటితోనే మెరుగైన ఆరోగ్యం సాధించుకోవచ్చు అని అన్నారు.అంతేకాక ఎస్.ఐ.పి (స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం)లో భాగంగా రెండవ రోజు పురస్కరించుకుని విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఆచార్య జగన్మోహనరావు సూచనలు చేశారు. ఈ సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ బి.దేవ జయరాజు, ఎన్.ఎస్.ఎస్ .ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ .జి.బి ఆనందకుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఆర్ హిమాలినీ దేవి ,రామారావు, చలం ప్రసాద్, జ్యోత్స్న, రత్న మొదలైన అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవాడలో యాక్సిస్ బ్యాంక్ 'ఈవాల్వ్'

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: భారతదేశంలో అగ్రగామి ప్రైవేట్ రంగ బ్యాంకులలో ఒకటైన యాక్సిస్ బ్యాంక్, తన బహుశహరాల జ్ఞాన శ్రేణి 'ఈవాల్వ్' 10వ ఎడిషన్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో నిర్వహించింది. "ఎంఎస్ఎంఈలు -10 ట్రిలియన్ ఎకానమీకి ఇంధనం" అనే అంశంపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్తలు, పరిశ్రమ నాయకులు, పాలసీ నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, భారత ఎంఎస్ఎంఈ రంగం ఎదుర్కొంటున్న అవకాశాలు, సవాళ్లపై చర్చించారు.ఈ కార్యక్రమంలో 150కుపైగా ఎంఎస్ఎంఈ ప్రమోటర్లు, మేనేజింగ్ డైరెక్టర్లు పాల్గొన్నారు. రతుల్ ముఖోపధ్యాయ్, ఈవిపి - ఎస్ ఈ జి యాక్సిస్ బ్యాంక్, సునీల్ పాచ్లాంగియా, రీజనల్ బ్యాంక్ హెడ్ , యాక్సిస్ బ్యాంక్ ఆర్థిక ధోరణులు విజయవాడ ఎంఎస్ఎంఈ రంగం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వృద్ధి, ఉపాధి సృష్టిలో పోషిస్తున్న కీలక పాత్రపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రియవరత్ శర్మ, (ఎస్ వి పి అండ్ బిజినెస్ హెడ్, యాక్సిస్ బ్యాంక్ సమన్వయం చేసిన ప్యానెల్ చర్చలో మోడెరేటెడ్, ఫణి కుమార్ సమినేని, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ అనంత లక్ష్మి స్పిన్నింగ్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పార్ట్నర్ శ్రీ అనంత లక్ష్మి టెక్స్టైల్స్, నరేంద్రనాథ్ చెబ్రోలు, ఫౌండర్ యన్స్ వన్ ఇండస్ట్రీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డెల్టా టెక్నాలజీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, సుజిత్ యలమంచిలి, కార్యదర్శి చలపతి ఎడ్యుకేషనల్ సొసైటీ పాల్గొని భారత ఎంఎస్ఎంఈల పట్టుదల, అభివృద్ధి దిశలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా విజయ్ శెట్టి, ప్రెసిడెంట్ హెడ్ - కమర్షియల్ బ్యాంకింగ్ కవరేజ్ గ్రూప్, యాక్సిస్ బ్యాంక్ మాట్లాడుతూ "భారత ఆర్థిక రూపాంతరానికి ఎంఎస్ఎంఈలు వెన్నెముకవంటివి. 33 లక్షలకుపైగా ఎంఎస్ఎంఈ యూనిట్లు, దృఢమైన మౌలిక సదుపాయాలతో ఆంధ్రప్రదేశ్ ఈ వేగాన్ని ముందుకు నడిపించడానికి ప్రత్యేకంగా సిద్ధమైంది. ఈవాల్వ్ వంటి కార్యక్రమాల ద్వారా వ్యాపారవేత్తలకు సరైన ఆర్థిక పరిష్కారాలు, జ్ఞానం, నెట్‌వర్క్‌లను అందించి భారతదేశం ట్రిలియన్ ఎకానమీగా మారే ప్రయాణంలో భాగస్వామ్యం అవ్వాలని మా లక్ష్యం" అన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం: రావెళ్ల

విశాలాంధ్ర-పెదపారుపూడి : రాష్ట్రంలో ఎస్ సి వర్గీకరణ కొరకు 1994 జూలై 7వ తేదీన ప్రకాశం జిల్లా, ఈదుమూడి గ్రామంలో ఏర్పాటైన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రస్తుత పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ప్రారంభమై నేటికి 30 సంవత్సరములు పైబడి అనేక పోరాటాలు చేసిన సందర్భంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ల ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలలో ఏకగ్రీవంగా వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించిన ఎమ్మెల్యేలకు అభినందనలు తెలిపారు.

నగరంలో 'కర్మణ్యే వాధికారస్తే'చిత్ర యూనిట్ సందడి

విశాలాంధ్ర - విజయవాడ (లబ్బీపేట) : విజయవాడ నగరంలో కర్మణ్యే వాధికారస్తే'చిత్ర యూనిట్ సందడి చేసింది. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో తీసిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలని చిత్ర దర్శకుడు చల్లపల్లి అమర్దీప్ కోరారు. అక్టోబర్ 1న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు. భవానిపురంలోని ఒక హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దర్శకుడు చల్లపల్లి అమర్దీప్ మాట్లాడుతూ సీనియర్ నటుడు బ్రహ్మాజీ, నటుడు శత్రు మాస్టర్ మహేంద్రన్ తో కలిసి కర్మణ్యే వాధికారస్తే చిత్రాన్ని నిర్మించడం జరిగిందన్నారు. తొలిసారిగా ఏ విధమైన డైలాగులు లేకుండా విడుదల చేసిన ట్రైలర్ కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ చిత్రాన్ని నిర్మించామని ప్రతి సన్నివేశం ప్రేక్షకులను ఉత్కంఠ భరించేలా ఉంటుందని తెలియజేశారు. మాస్టర్ మహేంద్రన్ ఈ చిత్రంలో ఒక అద్భుతమైన క్యారెక్టర్ లో కనిపిస్తారని ఆయన క్యారెక్టర్ చిత్రానికి హైలెట్గా ఉంటుందని చెప్పారు. ఎలాంటి స్టార్స్ లేకుండానే ఒక క్రైమ్ ట్రిల్లర్ సినిమాను తీయడం జరిగిందని చిత్ర నిర్మాణానికి నిర్మాత తమకు ఎంతగానో సహకరించారని అన్నారు. ఈ చిత్రంలో నటులు బెనర్జీ పృధ్వి శివాజీ రాజారత్నం సుధా కూడా నటించారని వారు తమ పాత్రలకు తగ్గట్టుగా నటించడం జరిగిందని చెప్పారు. రెండు పెద్ద చిత్రాలు విడుదలవుతున్న వేళ తమ చిన్న చిత్రాన్ని అక్టోబర్ ఒకటో తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చెప్పారు. క్రైమ్ ట్రిల్లర్ నేపథ్యంలో సాగే ఈ చిత్రాన్ని ప్రేక్షకులు చూసి విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం హీరోయిన్ యజ్ఞ మాట్లాడుతూ తెలుగులో తాను మొదటి సినిమాలో నటిస్తున్నారని తాను పవర్ఫుల్ పోలీస్ క్యారెక్టర్ లో ప్రేక్షకులకు కనబడతానని అన్నారు. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు చూసి విజయవంతం చేయాలని కోరారు అనంతరం మరో హీరోయిన్ అయేషా మాట్లాడుతూ ఇప్పటికే విడుదలైన ట్రైలర్ కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోందని అలాగే చిత్రాన్ని కూడా ప్రేక్షకులు వీక్షించాలని ఆమె కోరారు. అనంతరం నిర్మాత డి ఎన్ ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ దర్శకుడు అమర్ దీప్ చెప్పిన కథ విన్న వెంటనే ఈ చిత్రాన్ని నిర్మించడం జరిగిందన్నారు. నటులు బ్రహ్మాజీ ,శత్రు వారిద్దరూ ఈ సినిమాకు ప్రాణం పెట్టి పనిచేశారని చెప్పారు. వారి ఇద్దరి నటన ఈ సినిమాకు ప్రాణం పోస్తుందన్నారు. ప్రతి సన్నివేశాన్ని దర్శకుడు చాలా చక్కగా చిత్రీకరించడం జరిగిందని, క్రైమ్, థ్రిల్లర్ సన్నివేశాలు ప్రేక్షకులను అలరిస్తాయని చెప్పారు. అక్టోబర్ 1న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నామని ప్రేక్షకులు ఈ చిత్రాన్ని వీక్షించి ఆదరించాలని ఆయన కోరారు

ఐడిబిఐ బ్యాంక్ రిటైల్ లోన్ ఉత్సవ్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఈ పండగ సీజన్‌ను ఘనంగా ఆచరించుకునేందుకు ఐడిబిఐ బ్యాంక్ ఈ నెల 22 నుంచి అక్టోబరు 4 వరకు ప్రత్యేక 'రిటైల్ లోన్ ఉత్సవ్'ను ప్రారంభించింది. 'బ్యాంక్ ఐసా దోస్త్ జైసా' అనే బ్యాంక్ బ్రాండ్ తత్వాన్ని విస్తరిస్తూ, ఈ ప్రయత్నం ద్వారా హౌసింగ్ లోన్, ఆటో లోన్, ఎడ్యుకేషన్ లోన్, ఆస్తిపై రుణం, వ్యక్తిగత రుణంతో సహా విస్తృత శ్రేణి రిటైల్ రుణాలలో ప్రత్యేకమైన ఆఫర్‌లతో కస్టమర్ కేంద్రీకృత విధానాన్ని బ్యాంక్ హైలైట్ చేస్తుంది. ఈ పవిత్రమైన పండగ సమయంలో భారతీయ కుటుంబాలు ముఖ్యమైన జీవనశైలి, ఆర్థిక నిర్ణయాలు తీసుకునేటప్పుడు వారి అభివృద్ధి చెందుతున్న ఆకాంక్షలకు అనుగుణంగా 'రిటైల్ లోన్ ఉత్సవ్'ను రూపొందించారు. భారతదేశంలోని 29 రాష్ట్రాల్లోని 156 జిల్లాలను కవర్ చేసే 'రిటైల్ లోన్ ఉత్సవ్'ను బ్యాంక్ ఎంపిక చేసిన 310 శాఖలను గుర్తించింది.

బిగ్ బెస్పోక్ ఏఐ ఫెస్టివల్‌ను తీసుకువచ్చిన సామ్‌సంగ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలో అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, 'ది బిగ్ బెస్పోక్ ఏఐ ఫెస్టివల్'ను ప్రకటించింది. ఈ అతిపెద్ద పండుగ వేడుక అయిన బెస్పోక్ ఏఐ డిజిటల్ ఉపకరణాలలో వినియోగదారులకు అద్భుతమైన డీల్‌లు, రివార్డులను అందిస్తుంది. అక్టోబర్ 26 వరకు చెల్లుబాటులో ఉన్న ఈ ఆఫర్లలో భాగంగా, వినియోగదారులు ప్రత్యేకమైన ఆఫర్‌లు, క్యాష్‌బ్యాక్, పండుగ రివార్డుల ద్వారా సామ్‌సంగ్ తాజా ఏఐ ఆధారిత ఆవిష్కరణలతో వారి ఇళ్లను అప్‌గ్రేడ్ చేయడంలో సహాయపడుతుంది. ఈ ప్రచారంతో, సామ్‌సంగ్ ఈ పండుగ సీజన్‌లో భారతీయ వినియోగదారులకు అనుసంధానిత, సహజమైన, శక్తి సమర్థవంతమైన సాంకేతికతను మరింత అందుబాటులోకి తెస్తోంది.

మార్కెట్లోకి రాయల్ స్టాగ్ బారెల్ సెలక్ట్ ప్రీమియర్ విస్కీ

విశాలాంధ్ర- గుంటూరు: పెర్నాడ్ రికార్డ్ ఇండియా తమ కొత్త ఉత్పత్తి రాయల్ స్టాగ్ బారెల్ సెలక్ట్ ప్రీమియర్ విస్కీ ప్రారంభోత్సవాన్ని ప్రకటిస్తోంది. ప్రతి సిప్ లో విలక్షణత, స్ట్రాంగ్ రుచిని కోరుకునే కొంతమంది కోసం రూపొందించబడిన ఈ కొత్త వ్యక్తీకరణ అనేది బ్రాండ్ శ్రేష్టత కోసం చేస్తున్న నిరంతర ప్రయత్నం, భారతదేశపు విస్కీలో ఆవిష్కరణకు బ్రాండ్ నిబద్ధతకు ఒక రుజువుగా నిలిచింది. కొత్త ఉత్పత్తి పొడవు, నాజూకైన బాటిల్లో లభిస్తోంది. ఇది శ్రేణిలోనే మొదటిసారి ప్రీమియం క్లియర్-ఆన్-క్లియర్ లేబుల్ తో కలపబడిన సొగసుదనం వెల్లడిస్తుంది. మాస్టర్ బ్లెండర్ కెవిన్ బామ్ ఫోర్త్ తో మద్దతు చేయబడిన, కొత్త విస్కీ నైపుణ్యం, ప్రామాణికతను సూచిస్తోంది. ట్రిపుల్ సెలక్ట్ ప్రామిస్ యొక్క హామీతో రూపొందించబడిన, రాయల్ స్టాగ్ బారెల్ సెలక్ట్ ప్రీమియర్ విస్కీ మూడు ఉన్నతమైన ఉత్పత్తి గుణాలను కలిపింది. సెలక్ట్ ఇండియన్ గ్రెయిన్ స్పిరిట్స్, సెలక్ట్అమెరికన్ ఓక్ బారెల్స్ లో పరిణితి చెందిన సెలక్ట్ స్కాచ్ మాల్ట్స్.. ఫలితంగా నైపుణ్యం, నాణ్యతల ఉన్నతమైన ప్రమాణాలను సూచించే ద్రవం.. నాణ్యతను గ్రహించే కేవలం కొంతమంది కోసం సాటిలేని మిశ్రమం సృష్టించడానికి బ్రాండ్ వారి నిబద్ధతకు రుజువుగా నిలుస్తుంది.

ఘనంగా పోషణ మహా

విశాలాంధ్ర-గంపలగూడెం : గంపలగూడెం లోని అంగన్వాడీ కేంద్రం నందు మంగళవారం నాడు పోషణ మహాఘనంగా ఐసీడీఎస్ అధికారులు నిర్వహించారు. 0-6 మరియు 3-6 సంవత్సరాల పిల్లల తల్లులు, గర్భవతులు, బాలింతలకు మరియు కిశోరి బాలికలు ఏరియా లోని లబ్ధిదారులను ఆహ్వానించి అంగన్వాడి కేంద్రం నందు పంపిణీ చేసే బాల సంజీవని కి ట్స్ ఆవశ్యకతను వివరించారు. షోషక విలువలను గురించి 6 నెలలు నిండిన పిల్లలకు బాల అమృతం యొక్క ప్రాధాన్యతను లబ్ధిదారులకు ఐసిడిఎస్ సూపర్వైజర్ వై ముని లక్ష్మి తెలియజేశారు . బాల అమృతం యొక్క పోషక విలువలను మరియు పిల్లలకు పౌష్టికాహారం కూడిన ఆహారాన్ని అందించాల నీ ఆమె తెలిపారు. ఆకుకూరలు, కూరగాయలు మునగాకు వంటి పోషకాహారాలు గర్భవతులు, బాలింతలు మరియు కిశోరి బాలికలు తీసుకోవాలని ఈ సందర్భంగా లబ్ధిదారులకు వివరించిన సూపర్ వైజర్ వై. మునిలక్ష్మి, గ్రామ సర్పంచ్ కోట. పుల్లమ్మ లు లబ్ధిదారులకు తెలియజేశారు. షోషణ మహా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు యం. కస్తూరి, ఏ. నాగమణి, బి స్రవంతి, పి. హసీనా బేగం, కే .పద్మ, జీ. జ్యోతి, పి.బుజ్జి, యం. బాలనాగేశ్వరమ్మ, కే.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిట్టూర్పులో భజన పోటీలు

విశాలాంధ్ర - ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలోని చిట్టూర్పు గ్రామంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో నిర్వహిస్తున్న కృష్ణా, ఎన్టీఆర్, నెల్లూరు జిల్లాల స్థాయి తాళం భజన పోటీలు ఉత్సాహ భరితంగా సాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం బోగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్రీ నాగసాయి మహిళా భజన సమాజం, యండకుదురు గ్రామానికి చెందిన శ్రీ గీతా భక్త సమాజం, పెదకళ్లేపల్లి గ్రామానికి చెందిన శ్రీ సీతారామ చంద్రమౌళి భజన సమాజం వారు ప్రదర్శన నిర్వహించారు. యండకుదురు గ్రామానికి చెందిన శ్రీ గీతా భక్త సమాజం గురువు సిద్దినేని ప్రమీలా రాణితో పాటు సభ్యులు నిర్వహకులు మెమెంటో అందించి సత్కరించారు. కొడాలి పీఏసీఏస్ గుత్తికొండ ప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా పడుగు ప్రభాకర్, పి.శ్రీనివాసరావులు వ్యవహరించారు. దాసరి సతీష్, యలవర్తి వంశీ, వేములపల్లి సుధీర్, పరుచూరి వెంకటేశ్వరరావు. వాకా రాకేష్, గుత్తికొండ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు కవిత్వపు నుడికారం 'గుర్రం జాషువా': మాజీమంత్రి డొక్కా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తెలుగు కవిత్వపు నుడికారం కవికోకిల గుర్రం జాషువా అని మాజీమంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ కొనియాడారు. మహాకవి గుర్రం జాషువా 130వ జయంతి వారోత్సవాల సందర్భంగా మంగళవారం ఉదయం ఎంజెజెవస్ నగరంపాలెంలోని జాషువా విగ్రహం వద్ద ఉపాధ్యక్షులు అత్తోట జోసఫ్ కుమార్ అధ్యక్షతన 'జాషువా సాహిత్యం-సామాజిక సంస్కరణ' అంశంపై సభ జరిగింది. తొలుత జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ మహాకవి జాషువా సమకాలీన భావ కవిత్వ సంప్రదాయం నుండి పక్కకు జరిగి సామాజిక సంస్కరణ ప్రయోజనం ఆశించి రచనలు చేశారన్నారు. అట్టడుగు కులంలో పుట్టి అనేక అవమానాలు ఎదుర్కొని అంతే కసితో కవిత్వంలో అద్భుతాలు సృష్టించి మహాకవిగా ప్రజల నాల్కలందు నిలిచి పోయారని ప్రశంసించారు. నాటి సమాజంలో బలంగా నాటుకుపోయిన మూఢాచారాలపై ఆయన తిరగబడ్డారని, ఛీత్కారాలు ఎదురైన చోటే తన సమకాలీన తెలుగు కవుల్లో ఏ కవి పొందనన్ని సన్మానాలు, సత్కారాలు, బిరుదులు పొందారని కొనియాడారు. సభ అనంతరం జాషువా సాహిత్యంపై విశేష అధ్యయనం చేసిన జేకేసీ కళాశాల రిటైర్డ్ ఉపన్యాసకులు మట్టా విజయశ్రీని ఎంజెజెవస్ నాయకులు ఘనంగా సన్మానించారు. పద్య గాయకులు జెట్టి బాబురావు, ఎన్. చంద్రపాల్‌లు పాడిన జాషువా పద్యాలు సమాసదులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది చందవోలు శోభారాణి, పినపాటి మోహనరావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, కవి దేవరపల్లి ప్రభుదాస్, నల్లపు నీలాంబరం, తాటికొండ నరసింహారావు, బత్తుల కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి మరియు పరిసర ప్రాంత గ్రామాలలో భక్తులు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకుంటున్నారు. పట్టణంలోని పలు కూడళ్లలో దుర్గామాత అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి దర్శించుకున్న భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రివేళలో రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ప్రతి రోజు అమ్మవారికి అలంకరణలు చేసి దూపదీప నైవేద్యాలతో పూజలు నిర్వహిస్తున్నారు. స్థానిక కాళికామాత గుడి జయప్రకాష్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద భారీ ఎత్తున అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా ప్రతి రోజూ నాటికలు, నాటకాలు, నృత్య కార్యక్రమాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దేవీచౌక్, మారీస్‌పేట, చెంచుపేట తదితర ప్రాంతాలలో నిర్వాహకులు అమ్మవారిని పూజలు నిర్వహించి భక్తులందరికి తీర్థప్రసాదాలు అందజేశారు. నందివెలుగులోని శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శ్రీ కనకదుర్గమ్మ శ్రీ గజలక్ష్మీదేవి అలంకారంతో దర్శనమిచ్చారు. శ్రీ వాసవి అమ్మవారి ఆలయంలో శ్రీ వాసవీ మాత శ్రీ గాయత్రి దేవి అలంకారంలోనూ, శివాజి చౌక్‌లోని శ్రీ కాళీ మాత శ్రీ సంతాన లక్ష్మి అలంకారంలోనూ, దేవి చౌక్‌లోని శ్రీ రాజరాజేశ్వరి దేవి శ్రీ గాయత్రిమాత అలంకారంలోనూ, రామ లింగేశ్వరపేటలోని గంగా పర్వతవర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీ పర్వతవర్ధిని శ్రీ గాయత్రిమాత అలంకారంలోనూ దర్శనమిచ్చారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం కావాలి

విశాలాంధ్ర-మంగళగిరి: నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలందరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అదనపు కమిషనర్ కె.శకుంతల సూచించారు. నీటిని తప్పనిసరిగా మరిగించి తాగాలని, ఇంటి మరియు వీధి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, కొద్ది రోజుల పాటు బయట తినుబండారాలను మానుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.మంగళవారం ఆమె రత్నాల చెరువు, లక్ష్మీనరసింహ కాలనీ, పావులూరి కాలనీలలో పర్యటించి, ప్రజలకు వ్యాధుల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లకు ప్రతి ఇంటిని సందర్శించి ఫీవర్ సర్వే చేయాలని, జ్వరబారిన పడిన వారికి వెంటనే వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఇ జి.ప్రసన్న జ్యోతి, వార్డు అడ్మిన్ కార్యదర్శులు, హెల్త్ కార్యదర్శులు, శానిటేషన్ కార్యదర్శులు, ఎమినిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్నేహితులే హత్యచేశారు..

వీడిన కాలిన శవం మిస్టరీ

విశాలాంధ్ర-చిలకలూరిపేట: ఏ ఆధారం లేదు.. కాలిపోయిన గుర్తు తెలియని శవం... నెలల తరబడి కొనసాగిన దర్యాప్తు.. అయినా చిలకలూరిపేట రూరల్ పోలీసులు సాంకేతిక ఆధారాలతో కేసు ను చేధించారు. హత్యకేసులో నిందితులను అరెస్టు చేసి ఉన్నతాధికారుల చేత ప్రశంసలు పొందారు. ఈ ఏడాది జూన్ 24వ తేదీ యడ్లపాడు సమీపంలోని జాతీయ రహదారి సర్వీస్‌రోడ్డులోని కాల్వలో శవం కాలుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ ప్రాంతానికి చేరుకున్న పోలీసులు మంటలను ఆర్పి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఈ దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

ఈ సందర్భంగా మంగళవారం చిలకలూరిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నరసరావుపేట డీఎస్పీ ఎం హనుమంతరావు కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన తాడిబోయిన గోపి(32) గతంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేసేవాడు. ఆతనికి దక్షిణామూర్తి సెలిస్టియాన్ క్రియేషన్స్ బ్యానర్ పై షార్ట్‌ఫిలింలు,అలాగే మిషన్ మంగళాద్రి పేరుమీద వెబ్‌సిరీస్‌లు తియ్యడం ప్రారంభించాడు. క్రమంలోనే ఈ ఏడాది జూన్ 25వ తేదీన గుర్తుతెలియని మృతదేహం యడ్లపాడు సర్వీస్ రోడ్డు కాల్వలో కాలిపోతున్న స్థితిలో కనిపించింది. పోలీసుల విచారణలో అది తాడిబోయిన గోపీ మృతదేహంగా గుర్తించారు. చనిపోయిన గోపీకి గుంటూరుకు చెందిన ఆఫ్రిన్ అనే ఆమె ద్వారా వాళ్ల తమ్ముడు, గుంటూరులోని సుద్దపల్లిడొంకలో నివాసం ఉండే షేక్ ఇమ్రాన్ పరిచయమయ్యాడు. కొంతకాలానికి గోపీ, ఇమ్రాన్‌ల మధ్య మనస్పర్ధలు ఏర్పడిన క్రమంలో గోపీని చంపాలని నిర్ణయించుకున్నాడు. ఇమ్రాన్‌కు స్నేహితులైన గుంటూరు రామిరెడ్డిపేటకు చెందిన షేక్ రియాజ్, నల్లచెరువు ప్రాంతానికి చెందిన షేక్ ఖాజా మొహిద్దీన్‌ల కలుపుకొని పథకం ప్రకారం గుంటూరులోని ఎంప్లాయిస్ కాలనీలో ఉన్న ఇమ్రాన్ అద్దె గదికి గోపీని జూన్ 24న ఫోన్ చేసి రప్పించారు. ముగ్గురు కలసి ఇనుపరాడ్డుతో గోపీ తలపై కొట్టి ఆపై తాడుతో మెడకు ఉరివేసి చంపివేశారు.మృతుడు గోపికి చెందిన కారు డిక్కీలో శవాన్ని చిలకలూరిపేటకు తీసుకువచ్చి ఇక్కడ పెట్రోల్ బంకులో రెండు లీటర్ల బాటిల్ పెట్రోల్ కొనుగోలు చేసి గుంటూరు రోడ్డులో తిమ్మాపురం దాటిన తర్వాత యడ్లపాడు సమీపంలో సర్వీస్ రోడ్డు పక్కన సిమెంట్ కాల్వలో గోపీ మృతదేహాన్ని వేసి పెట్రోలు పోసి తగలబెట్టి పరారయ్యారు. యడ్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన క్రమంలో నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి గోపీకి చెందిన హ్యుండై ఆస్టా కారు, కీ పాడ్ ఫోన్, సెల్‌ఫోన్, ఏటీఎం కార్డులు, రూ. 12వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన చిలకలూరిపేట రూరల్ సీఐ బి సుబ్బానాయుడు, యడ్లపాడు ఎస్ఐ టి శివరామకృష్ణ, ఏఎస్సై సుబ్బారావు, ఏఎస్సై రోసిబాబు, హెచ్‌సీ శ్రీధర్, హెచ్‌సీ దేవరాజ్, పీసీలు ఇర్మియ, రాజేష్, రత్న కిషోర్, హెచ్‌జీలు సాంబ, మధుబాబు అలాగే సీడీఆర్ వింగ్ పీసీ వి. శ్రీనివాసరావులను జిల్లా ఎస్పీ అభినందించారు.

దేశీయ వైద్య బలోపేతానికి కృషి

రాష్ట్ర ఔషధ, సుగంధ మొక్కల బోర్డు సీఈఓ చంద్రశేఖర్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆయుష్ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలు అనుకూలంగా రాష్ట్రంలో దేశీయ వైద్యానికి అవసరమైన ఔషధ, సుగంధ మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఔషధ, సుగంధ మొక్కల బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆవుల చంద్రశేఖర్ తెలిపారు. ప్రపంచ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ దేశీయ వైద్య సంఘం, ఆంధ్రప్రదేశ్ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక అరండల్ పేటలోని ఆర్య సమాజం సమావేశ మందిరంలో 'ఔషధ మొక్కల నిర్వహణ, వినియోగం'పై రాష్ట్ర స్థాయి సదస్సు, ఔషధ మొక్కల ప్రదర్శన నిర్వ హించారు. గృహ వైద్యం గోడ పత్రికలను అతిధుల చేత ఆవిష్కరించిన అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఈవో చంద్రశేఖర్ మాట్లాడుతూ పంచభూతాల సాక్షిగా జన్మించిన మనిషి జీవనం ప్రకృతితో ముడి వేసుకున్నదని చెప్పారు. మంచి అనారోగ్యానికి సంబంధించిన ప్రతి ఔషధం మొక్కల ద్వారానే ఉపశమనం నివారణ కలుగుతు న్నదన్నది వాస్తవమన్నారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శెట్టి వీర వెంకట సత్యనారాయణ అధ్యక్షత వహించగా గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ ఎ.గోరీష్ బాబు మాట్లాడుతూ 53 సంవత్సరాల క్రితం వైద్య భూషణ డాక్టర్ పిల్లలమర్రి వెంకటరామయ్య సారథ్యంలో దేశీయ వైద్య సంఘం ఏర్పడిందని, అన్ని జిల్లా స్థాయి సంఘాలు దేశీయ ప్రకృతి ఆయుర్వేద యునాని వైద్యాలు శాస్త్రీయ ప్రమాణాలతో అందిస్తూ పునర్జన్మలు అందిస్తున్నాయని చెప్పారు. దేశీయ వైద్యశాస్త్రాలపై అవగాహన ప్రదర్శన నిర్వహించి నాయుడు ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బోర్డు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.ప్రదీప్ కుమార్, సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ నామాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యువతలో గుండె పోటు ప్రమాదాలు

గుంటూరు: యువతలో గుండె సంబంధిత వ్యాధులు ఇటీవల కాలంలో బాగా పెరుగుతున్నాయని ప్రముఖ గుండె వైద్య నిపుణులు, అమృత ఆసుపత్రి కార్డియాలజిస్టు డాక్టర్ వి. అంజిత్ ఆందోళన వ్యక్తపరిచారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు వృద్ధుల వ్యాధిగా భావించిన గుండె జబ్బులు ఇప్పుడు ఉద్యోగులు, మధ్య వయస్కులు మాత్రమే కాదు, 20 నుంచి 30 ఏళ్ల వయసున్న యువతలో కూడా విస్తృతంగా కనిపిస్తున్నాయన్నారు. రక్తపోటు, ఊబకాయం, అకస్మాత్తు గుండె ఆగిపోవడం వంటి కేసులు గణనీయంగా పెరుగుతున్నాయని,

రాష్ట్రంలోని పట్టణాల్లాగే గ్రామాల్లో కూడా యువతలో రక్తపోటు, డయాబెటిస్, ఊబకాయం కేసులు పెరుగుతున్నాయని చెబుతున్నారు. మిల్లెట్ల ఆధారిత సంప్రదాయ ఆహారం ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఊబకాయం రేటు అధికంగా ఉంది. నగరాల్లో అయితే ఒత్తిడిగల ఉద్యోగాలు, అస్తవ్యస్తమైన నిద్ర, ఫాస్ట్‌ఫుడ్ అలవాటు యువత ఆరోగ్యాన్ని మరింత ప్రమాదంలోకి నెడుతున్నాయన్నారు. పరిశోధనలు కూడా రక్తంలో ఉండే కొన్ని సూచీలు గుండె జబ్బులతో మరణించే ప్రమాదాన్ని గణనీయంగా పెంచుతున్నాయని చూపిస్తున్నాయన్నారు.

, "ఇప్పుడు టాము 20%-%30 ఏళ్ల వయసున్న యువకులు, యువతులలో కూడా గుండెపోటు, అకస్మాత్తు గుండె ఆగిపోవడం వంటి కేసులు ఎక్కువగా చూస్తున్నాం అన్నారు. రక్తపోటు, కొలెస్ట్రాల్, డయాబెటిస్‌తో పాటు నిద్రలేమి, స్లీప్ అప్నియా వంటి సమస్యల కోసం కూడా స్క్రీనింగ్ చేయించుకోవాలని, సమయానికి డాక్టర్ సలహా తీసుకోవడం, మందులు క్రమంగా వాడడం, జీవనశైలిలో మార్పులు చేయడం ద్వారా ఈ సమస్యలను నివారించవచ్చు అన్నారు. హృదయ సంరక్షణ అనేది ఆసుపత్రి వరకే పరిమితం కాకుండా ఇంట్లోనూ మొదలవ్వాలి," అని అన్నారు. పశ్చిమ దేశాల కంటే దాదాపు ఒక దశాబ్దం ముందుగానే అకస్మాత్తు గుండె మరణాలు ఇక్కడ జరుగుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మందులు వాడకపోవడం, లక్షణాలను నిర్లక్ష్యం చేయడం పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తున్నాయని, ఛాతినొప్పి, అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలను చిన్నచూపు చూడడం ఇప్పటికే ఎన్నో ప్రాణాలను తీసేసింది అని, ఈ వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆరోగ్య తనిఖీలు చేయించుకోవడం, సరైన ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం, ఒత్తిడిని తగ్గించుకోవడం మరియు లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం చాలా అవసరం అని తెలిపారు